ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై జగన్ విషప్రచారం చేస్తున్నారని, గత వైసీపీ ప్రభుత్వం వేల కోట్ల బకాయిలు పెట్టింది. కూటమి ప్రభుత్వం పాత బకాయిలను దశలవారీగా చెల్లిస్తూ, విద్యార్థుల చదువులకు భరోసా కల్పిస్తోంది.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

సోమవారం 23.11.2026


INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 212 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

పంచాయతీల్లో ఏకగ్రీవాలకే పెద్దపీట!



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఎన్నికల సమరం ముగిసింది.. ఇక అభివృద్ధి పథంలో గ్రామాలు పరుగులు తీయాలి! రాజకీయ పోటీలు, వ్యక్తిగత పంతాలు, ఆధిపత్య పోరులను పక్కనపెట్టి పంచాయతీల్లో ఏకగ్రీవాలకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. గ్రామస్థులందరి ఆమోదంతో ఏకగ్రీవాలు జరిగితే ప్రభుత్వ ప్రోత్సాహక నిధులతో స్థానికంగా అభివృద్ధి పనులు చేపట్టవచ్చని సూచించారు. జనాభా ఆధారంగా రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు అందించనున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రులు, పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

విజయం.. పాలనకు గుర్తింపు: మంత్రులు, పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం స్థానికసంస్థల ఎన్నికల ఫలితాలపై సమీక్షించారు. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి సాధించిన విజయాన్ని రెండున్నరేళ్ల ప్రభుత్వ పాలనకు ప్రజలు ఇచ్చిన గుర్తింపుగా


- పోటీలు, పంతాలు పక్కనపెట్టండి
- గ్రామాభివృద్ధికి ఐక్యంగా పనిచేయండి
- ఏకగ్రీవ పంచాయతీలకు రూ.15-50 లక్షల ప్రోత్సాహకాలు
- మంత్రులు, నేతలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం 3 లో..▶

ఇక ఇంటికే కొత్త అడంగల్

మ్యుటేషన్ పూర్తికాగానే పోస్టులో పంపిణీ	రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధలు తీరనున్నాయి	ప్రతి నెలా 26 నుంచి 30 వరకు పత్రాల జారీ	ప్రస్తుత నెల నుంచే కొత్త విధానం అమలు

దమ్ముంటే చర్చకు రండి

జగన్‌కు లోకేశ్ బహిరంగ సవాల్



- పెట్టుబడులు.. ఉద్యోగాలపై చర్చకు సిద్ధం
- దిగ్గజ సంస్థల రాకే మా ట్రాక్ రికార్డు

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం.. యువతకు ఉద్యోగాలు కల్పించడంపై బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ వైకాపా అధినేత వైఎస్ జగన్‌కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులు, వివిధ దశల్లో ఉన్న పారిశ్రామిక ప్రాజెక్టుల వివరాలను వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారు ఇప్పుడు వాటి ఘనతను తమ ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.

ఇదీ మా ట్రాక్ రికార్డు: 2024-26 మధ్య రాష్ట్రంలో వివిధ రంగాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టినట్లు లోకేశ్ తెలిపారు. గూగుల్ రూ.1.33 లక్షల కోట్లు, ఏఎం/ఎన్ఎస్ ఇండియా రూ.1.36 లక్షల కోట్లు, బ్రూక్‌ఫీల్డ్ రూ.1.06 లక్షల కోట్లు, రిలయన్స్ రూ.43 వేల కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చినట్లు వివరించారు. వీటితో పాటు రెన్యూ, వారీ, ప్రీమియర్ ఎనర్జీస్, అల్ట్రాటెక్, దాల్మియా భారత్ వంటి సంస్థల ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఐటీ రంగంలోనూ విస్తరణ: అమరావతి క్వాంటమ్ వ్యాలీ, టాటా, ఐబీఎం, కాగ్నిజెంట్ తదితర సంస్థల ప్రాజెక్టులనూ మంత్రి ప్రస్తావించారు. కొన్ని ప్రాజెక్టులు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించగా, మరికొన్ని నిర్మాణ దశలో, ఇంకొన్ని కార్యరూపం దాల్చే ప్రక్రియలో ఉన్నట్లు వెల్లడించారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంతో పాటు యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.


ప్రాజెక్టులను అడ్డుకుని.. క్రెడిట్ కోసం ఆరాటం: రాష్ట్రంలో పరిశ్రమలు, భారీ ప్రాజెక్టులు రావడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే గత పాలకులు వాటిని అడ్డుకునేందుకు న్యాయస్థానాల్లో పిటిషన్లు వేశారని లోకేశ్ ఆరోపించారు. ఇప్పుడు అదే ప్రాజెక్టుల ఘనతను తమకు ఆపాదించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

మిగతా 3లో...

ప్యాలెస్ దారికి అడ్డుకట్ట

- షర్మిలను నిలువరించిన బెంగళూరు పోలీసులు
- కోర్టు ఉత్తర్వులతో యలహంకకు బ్రేక్
- విమానాశ్రయం వద్దే వాహనాల మళ్లింపు
- పోలీసులతో షర్మిల వాగ్వాదం

2 లో



పంచాయతీ పోరుకు జనసేనకు స్వేచ్ఛ!

- నామినేషన్లు వేసేందుకు పూర్తి వెసులుబాటు
- కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకాలు ఉండవు
- అభ్యర్థులకు అండగా ఐదు జోన్లలో హెల్ప్‌డెస్క్‌లు
- ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి.. పవన్ కల్యాణ్ ఆదేశం

3 లో

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): గ్రామస్థాయి రాజకీయ సమరానికి జనసేన పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే జనసైనికులు, వీరమహిళలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. నామినేషన్లు వేసేందుకు ఎలాంటి రాజకీయపరమైన ఆంక్షలు ఉండబోవని స్పష్టం చేశారు. మున్సిపల్, పరిషత్ ఎన్నికల తరహాలో పంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాట్లు, పంపకాలు ఉండవని తేల్చిచెప్పారు. పోటీ చేయాలనుకునే పార్టీ శ్రేణులను ఎవరూ అడ్డుకోవద్దని నాయకులకు ఆదేశాలు జారీ చేశారు.

అడ్డంకులు సృష్టించొద్దు: గ్రామపంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా, స్థానిక సంస్థలను బలోపేతం చేసే లక్ష్యంతో జరుగుతాయని పవన్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే జనసైనికులు,

మిగతా 2లో...



నేటి నుంచి కొత్త పాలన



- 100 పట్టణ స్థానిక సంస్థల్లో నూతన పాలకవర్గాలు
- 13 కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీల్లో తొలి సమావేశాలు
- నేడే డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నిక

2 లో

పోలింగ్ కేంద్రాల కుదింపు

- సర్పంచి ఎన్నికలకే పరిమితమైన చోట్ల అమలు
- ఓటర్ల సంఖ్య 650 దాటరాదు
- కేంద్రాల విలీనానికి ఎస్ఈసీ మార్గదర్శకాలు

2 లో

బిస్లెరీ నీటిలో ప్రమాదకర రసాయనాలు

- చర్యలకు సిద్ధమైన ఎఫ్ఎస్ఎస్ఏఐ
- పరీక్షల్లో బ్రోమేట్, క్యాన్సర్ కారక పీఏహెచ్‌ల గుర్తింపు
- రెండు దశల్లోనూ నాణ్యతా ప్రమాణాలు విఫలం
- సంస్థపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి
- ఆశా కన్వెక్షనరీ కుకీల బ్యాచ్ వెనక్కి తీసుకోవాలని ఆదేశం


3 లో



సరిహద్దు గ్రామాలకు మళ్లీ కళ

- చైనా సరిహద్దుల్లో మారుతున్న వలసల బాట
- 40 గ్రామాలకు తిరిగొచ్చిన ప్రజలు
- వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్‌తో అభివృద్ధి
- రహదారులు, విద్యుత్తు, ఉపాధికి పెద్దపీట
- అరుణాచల్‌లో రూ.5,610 కోట్ల ప్రాజెక్టులు
- 11 జిల్లాల్లో రూ.110.95 కోట్లతో 199 పనులు

3 లో



ఏపీకి రైల్వే ట్రాక్ విస్తరణ



- రాష్ట్రంలో మూడు కొత్త రైల్వే లైన్లకు ప్రతిపాదనలు
- మార్కాపురం-శ్రీశైలం-సికింద్రాబాద్ మార్గం
- రాజంపేట-నెల్లూరు.. సామర్లకోట-చింతూరు అనుసంధానం
- సర్వే, డీపీఆర్‌లకు అనుమతి కోరిన దక్షిణ కోస్తా రైల్వేజోన్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీశైలానికి రైలు ప్రయాణం అందుబాటులోకి రానుందా? ఏజెన్సీ ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ పెరగనుందా? రాయలసీమ నుంచి నెల్లూరుకు నేరుగా రైలు మార్గం ఏర్పడనుందా? ఈ దిశగా ఆంధ్రప్రదేశ్‌లో మూడు కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. దక్షిణ కోస్తా రైల్వేజోన్ అధికారులు వీటిని రైల్వేబోర్డుకు పంపారు. మార్కాపురం-శ్రీశైలం-సికింద్రాబాద్, రాజంపేట-నెల్లూరు, సామర్లకోట-చింతూరు మార్గాల్లో కొత్త లైన్ల నిర్మాణానికి ముందడుగు వేయాలని కోరారు. వీటికి అనుమతి లభిస్తే

మిగతా 2లో...



మోదీ ముందుచూపుకు నీరాజనం

- బంగారం ధరల పతనంతో వ్యాపారులకు ఊరట
- కిలోపై రూ.65 లక్షలు తగ్గిన ధర
- నిల్వల కొనుగోళ్లతో నష్టాల ముప్పు తప్పింది
- ప్రధానికి కృతజ్ఞతలు తెలిపిన సీటీఐ

టెస్టుల్లో టీమ్‌ఇండియా ప్రపంచ రికార్డు



- తొలి ఏడు వికెట్లకూ అర్ధశతక భాగస్వామ్యాలు
- 720/9 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్
- న్యూజిలాండ్‌పై 352 పరుగుల ఆధిక్యం
- రాహుల్, పంత్ శతకాలతో పరుగుల వరద

వెల్లింగ్టన్: ఒకరిద్దరు రాణిస్తేనే భారీ స్కోరు సాధ్యమయ్యే టెస్టు క్రికెట్‌లో.. తొలి ఏడు వికెట్లకు అర్ధశతక భాగస్వామ్యాలు నమోదైతే? అది సాధారణ విషయం కాదు.. అసాధారణ ఘనత! అలాంటి అరుదైన ప్రపంచ రికార్డును టీమ్‌ఇండియా తన ఖాతాలో వేసుకుంది. న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత బ్యాటర్లు పోటీపడి పరుగులు సాధించారు. ఏకంగా 720/9 స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి ప్రత్యర్థిపై 352 పరుగుల భారీ ఆధిక్యాన్ని సంపాదించారు. టెస్టు చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో తొలి ఏడు వికెట్లకూ

మిగతా 3లో...

పంచాయతీ పోరుకు జనసేనకు స్వేచ్ఛ!



(మొదటి పేజీ తరువాయి)

వీరమహిళలు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చన్నారు. కూటమి పార్టీల మధ్య ఎలాంటి సీట్ల పంపకాలు ఉండవని, పోటీ చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని స్పష్టం చేశారు. జనసేన శ్రేణుల నామినేషన్లకు పార్టీ నాయకులు అడ్డంకులు సృష్టించారాదని ఆదేశించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు.

ఐదు జోన్లలో హెల్ప్‌డెస్క్‌లు: పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా విభజించి ఈ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. నామినేషన్ల దాఖలు మొదలుకొని ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా హెల్ప్‌డెస్క్ వెంటనే స్పందిస్తుంది. సమస్యలను పార్టీ కేంద్ర ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ దృష్టికి తీసుకురావాలని పవన్ సూచించారు. హెల్ప్‌డెస్క్ కార్యకలాపాలను జనసేన ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ పర్యవేక్షించనున్నారు.

కూటమి ఐక్యత చాటాలి: రాష్ట్రంలో ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో కూటమి పక్షాలు సాధించిన విజయోత్సాహాన్ని పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని పవన్ పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణపై పార్టీ ముఖ్య నేతలతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 26న జరగనున్న తొలి విడత పంచాయతీ ఎన్నికలకు జనసేన శ్రేణులు, నాయకులు సర్వసన్నద్ధంగా ఉన్నారని నేతలు ఆయనకు వివరించారు.

మూడు విడతల్లోనూ ఎన్నికలు సామరస్యపూర్వకంగా జరిగేలా చూడాలని పవన్ ఆదేశించారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ఫలితాల అనంతరం కూడా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగాలని సూచించారు. కూటమి ఐక్యతకు నిదర్శనంగా ఎన్నికలు జరగాలని ఆకాంక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని స్పష్టం చేశారు.

ఏపీకి రైల్వే ట్రాక్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్), సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన చేపట్టనున్నారు. మూడు మార్గాలూ అందుబాటులోకి వస్తే పర్యాటకం, పారిశ్రామిక రవాణా, పోర్టుల అనుసంధానానికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి.

శ్రీశైలానికి 290 కి.మీ. మార్గం: మార్కాపురం నుంచి శ్రీశైలం మీదుగా సికింద్రాబాద్ వరకు సుమారు 290 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ నిర్మించాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయానికి నేరుగా రైలు మార్గం లేదు. ఈ లైన్ ఏర్పాటైతే తెలంగాణతో పాటు ఉత్తరాది రాష్ట్రాల భక్తులు సికింద్రాబాద్ వైపు నుంచి, ఏపీలోని వివిధ ప్రాంతాలు, దక్షిణాది రాష్ట్రాల ప్రయాణికులు మార్కాపురం వైపు నుంచి శ్రీశైలానికి చేరుకోవచ్చు. పుణ్యక్షేత్రానికి రైలు సౌకర్యం కల్పించడంతో భక్తుల రాకపోకలు సులభతరం కానున్నాయి.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దొనకొండ–ఒంగోలు మధ్య మరో కొత్త రైల్వే లైన్‌కు ఇప్పటికే సర్వే, డీపీఆర్ ప్రక్రియ కొనసాగుతోంది. మార్కాపురం–శ్రీశైలం–సికింద్రాబాద్ మార్గం కూడా అందుబాటులోకి వస్తే కృష్ణపట్నం, రామాయపట్నం నౌకాశ్రయాలకు రవాణా అనుసంధానం మరింత మెరుగుపడనుంది. సామర్లకోట నుంచి జగ్గంపేట, రంపచోడవరం, మారేడుమిల్లి మీదుగా పోలవరం జిల్లా చింతూరు సమీపం వరకు సుమారు 150 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ మార్గం ఏర్పాటైతే ఏజెన్సీ ప్రాంతాలకు రైల్వే సదుపాయం విస్తరించనుంది.

మరోవైపు ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మీదుగా తెలంగాణలోని భద్రాచలం, పాండురంగాపురం వరకు 173 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ ఇప్పటికే మంజూరైంది. ప్రతిపాదిత సామర్లకోట–చింతూరు మార్గం ఈ లైన్‌తో అనుసంధానమవుతుంది. ఫలితంగా ఏజెన్సీ ప్రాంతాల నుంచి సామర్లకోట, రాజమహేంద్రవరం, భద్రాచలం వైపు రైలు రాకపోకలకు మార్గం సుగమం కానుంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ నుంచి బొగ్గు, ఇనుప ఖనిజాన్ని కాకినాడ పోర్టుకు తరలించేందుకు కూడా ఈ మార్గం ఉపయోగపడుతుంది. పారిశ్రామిక రవాణా వ్యయం తగ్గడంతో పాటు సరకు రవాణా వేగవంతం కానుంది. రాయలసీమ–నెల్లూరు మధ్య అనుసంధానం: రాజంపేట నుంచి నెల్లూరు వరకు సుమారు 120 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ నిర్మించాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతాల నుంచి నెల్లూరుకు నేరుగా రైలు మార్గం లేకపోవడంతో రేణిగుంట మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది. కొత్త లైన్ ఏర్పాటైతే ఈ దూరం, ప్రయాణ సమయం తగ్గనున్నాయి. ప్రస్తుతం ఓబుళవారిపల్లె నుంచి కృష్ణపట్నం పోర్టుకు రైల్వే లైన్ ఉన్నప్పటికీ అది కృష్ణపట్నం రైల్ కంపెనీ లిమిటెడ్ ఆధీనంలో ఉంది. ఈ మార్గంలో ప్రయాణికుల రైళ్లకు నడపాలనే డిమాండ్ ఉంది. అయితే మార్గమధ్యంలో పెద్ద సొరంగం ఉండటం, అక్కడ ప్రమాదాలు జరిగితే ప్రయాణికుల భద్రతకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాల నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా రాజంపేట–నెల్లూరు లైన్‌ను ప్రతిపాదించారు. ఈ మార్గం నిర్మాణం పూర్తయితే ప్రయాణికుల రైళ్లతో పాటు కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులకు సరకు రవాణా అనుసంధానం మెరుగుపడనుంది.

రాష్ట్ర ప్రభుత్వం కూడా లేఖలు: ఈ మూడు రైల్వే ప్రాజెక్టుల ఆవశ్యకతను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కూడా రైల్వేశాఖకు లేఖలు రాసింది. ప్రతిపాదనలను పరిశీలించి ఎఫ్ఎల్ఎస్, డీపీఆర్ తయారీకి అనుమతులు మంజూరు చేయాలని దక్షిణ కోస్తా రైల్వేజోన్ అధికారులు రైల్వేబోర్డును కోరారు. త్వరలోనే సర్వే, డీపీఆర్‌లకు అనుమతులు వచ్చే అవకాశం ఉందని రైల్వేశాఖ వర్గాలు వెల్లడించాయి. ఆమోదం లభిస్తే మూడు మార్గాల నిర్మాణానికి సంబంధించిన తదుపరి కార్యాచరణ ప్రారంభం కానుంది.

పి.జి.ఆర్.ఎస్ రద్దు



గుంటూరు, నవంబరు 22(జర్నలిస్ట్ ఫైల్) : ఎన్నికల విధులలో జిల్లా యంత్రాంగం నిమగ్నం కావడం వలన మరియు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉండటం వలన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు.

ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పూర్తి అయ్యేవరకు పి.జి.ఆర్.ఎస్ ను రద్దు చేయడం జరిగిందని చెప్పారు. ఈ అంశాన్ని ప్రజలు గమనించి సోమవారం వ్యయప్రయాసలకు ఓర్చి రావద్దని విజ్ఞప్తి చేశారు.

ప్యాలెస్ దారికి అడ్డుకట్ట



బెంగళూరు (జర్నలిస్ట్ ఫైల్) : సొంత ఇంటి గడప తొక్కేందుకు సొంత అన్నే అడ్డుపడటంతో వైఎస్ షర్మిల బెంగళూరు పర్యటన తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. కుమార్తె వివాహ ఏర్పాట్ల నిమిత్తం యలహంక ప్యాలెస్‌కు వెళ్లేందుకు సిద్ధమైన ఆమెకు కోర్టు ఉత్తర్వులు అడ్డంకిగా మారాయి. ప్యాలెస్‌లోకి ప్రవేశించేందుకు అనుమతి లేదంటూ పోలీసులు విమానాశ్రయం సమీపంలోనే ఆమెను నిలువరించారు. కోర్టు ఆదేశాలను పాటించాలని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులతో షర్మిల వాగ్వాదానికి దిగారు. చివరకు యలహంక వెళ్లకుండానే మరో హోటల్‌కు వెళ్లిపోవాల్సి వచ్చింది. కుటుంబ ఆస్తి వివాదం రాజకీయంగానూ చర్చనీయాంశమైంది.

విమానాశ్రయం వద్దే అడ్డగింత: పీసీసీ అధ్యక్షురాలు, వైఎస్ జగన్ సోదరి షర్మిల ఆదివారం తల్లి విజయమ్మ, కుమారుడు, కోడలితో కలిసి బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆమె యలహంక ప్యాలెస్‌కు వెళ్లనున్నట్లు ముందుగానే సమాచారం అందడంతో పోలీసులు విమానాశ్రయం, ప్యాలెస్ పరిసరాల్లో భారీగా మోహరించారు. విమానాశ్రయం నుంచి బయలుదేరిన షర్మిల వాహనాలను యలహంక వెళ్లే మార్గంలోకి అనుమతించలేదు. కోర్టు ఆదేశాల మేరకు ప్యాలెస్‌లోకి ప్రవేశించడానికి వీల్లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఆమె వాహనాలను బెంగళూరు నగరం వైపు మళ్లించారు. ఈ క్రమంలో పోలీసులతో కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు షర్మిల లీలా ప్యాలెస్ హోటల్‌కు బయలుదేరారు.

కోర్టును ఆశ్రయించిన జగన్: యలహంక ప్యాలెస్‌లోకి షర్మిల ప్రవేశించకుండా నిలువరించాలని కోరుతూ వైఎస్ జగన్ కోర్టును ఆశ్రయించారు. సిలికాన్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి భీమిశెట్టి రమేష్‌బాబు ద్వారా బెంగళూరు గ్రామీణ జిల్లా దేవనహళ్లిలోని సీనియర్ సివిల్ జడ్జి, జేఎంఎఫ్‌సీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయించారు. ప్యాలెస్ తమ సంస్థ స్వాధీనంలో ఉందని, అక్కడి ఆస్తులు, నిర్మాణాలు, పండ్లతోటల పరిరక్షణకు షర్మిల, ఆమెకు సంబంధించిన వ్యక్తుల ప్రవేశాన్ని అడ్డుకోవాలని కోరారు. గతంలో ప్యాలెస్‌లోని గెస్ట్‌హౌస్‌లో తాత్కాలికంగా ఉండేందుకు షర్మిలకు అనుమతి ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం అలంకరణ పనుల పేరుతో బయటి వ్యక్తులను లోపలికి పంపిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనివల్ల ప్యాలెస్‌లోని కట్టడాలు, ఫెన్సింగ్, పండ్ల చెట్లు, ఇతర చరాస్తులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వాదించారు.

కోర్టు మధ్యంతర ఉత్తర్వులు: పిటిషనర్ తరపు న్యాయవాది సుధీర్ మేడమ్మయ్య వాదనలు వినిపిస్తూ.. భారతి తల్లి ఇ.సి. సుగుణమ్మ 2007 మార్చి 1న 20 ఏళ్ల కాలానికి, అంటే 2027 ఫిబ్రవరి 28 వరకు ప్యాలెస్‌ను తమ సంస్థకు లీజుకు ఇచ్చారని తెలిపారు. అక్కడ పండ్లతోటలు, మొక్కలు, గెస్ట్‌హౌస్‌లు, ఇతర నిర్మాణాల అభివృద్ధికి భారీగా ఖర్చు చేసినట్లు వివరించారు. అనంతరం 2026 ఆగస్టు 27న సుగుణమ్మ తన కుమార్తె భారతి, మనుమరాళ్ల పేరున గిఫ్ట్ డీడ్ రాసిచ్చారని, దీంతో ఆస్తి హక్కులు వారికి బదిలీ అ–య్యాయని పేర్కొన్నారు. షర్మిల, ఆమెకు సంబంధించిన వ్యక్తుల జోక్యంతో ఆస్తులకు నష్టం కలిగే అవకాశం ఉందని వాదించారు.

ఈ వాదనలను, సమర్పించిన ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం.. ప్రాథమికంగా ఆస్తి పిటిషనర్ స్వాధీనంలో ఉన్నట్లు స్పష్టమవుతోందని అభిప్రాయపడింది. తదుపరి విచారణ జరిగే వరకు యలహంక ప్యాలెస్‌లోకి షర్మిల, ఆమెకు సంబంధించిన వ్యక్తులు ప్రవేశించకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కేసు విచారణను డిసెంబరు 19కి వాయిదా వేసింది. ఈ ఉత్తర్వుల అమలులో భాగంగానే పోలీసులు షర్మిలను ప్యాలెస్ వైపు వెళ్లకుండా అడ్డుకున్నారు.

పెళ్లి వేదిక మార్పు: షర్మిల తన కుమార్తె అంజిలిరెడ్డి వివాహాన్ని యలహంక ప్యాలెస్‌లో నిర్వహించనున్నట్లు ఆహ్వాన పత్రికలు ముద్రించి బంధుమిత్రులకు పంపిణీ చేశారు. అయితే అక్కడ వివాహం నిర్వహించేందుకు జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను నివసిస్తున్న ప్రాంగణంలో పెళ్లి జరిగితే భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయని, తన కుటుంబ భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని కోరుతూ ఇటీవల షర్మిలకు లేఖ రాశారు. ఈ పరిణామాల నేపథ్యంలో వివాహ వేదికను ఆమె మరోచోటికి మార్చుకున్నారు.

సంస్థలో భారతి గతంలో డైరెక్టర్: సిలికాన్ బిల్డర్స్ సంస్థలో 2017 ఫిబ్రవరి 16 వరకు వైఎస్ భారతి డైరెక్టర్‌గా కొనసాగినట్లు పిటిషన్‌లో ప్రస్తావించారు. భగవత్ సన్నిధి ఎస్టేట్స్ ఎల్ఎల్‌పీలో రమేష్‌బాబు, భారతి ప్రస్తుతం డైరెక్టర్లుగా ఉన్నట్లు సమాచారం. ఈ సంస్థల ద్వారా ప్యాలెస్ ఆస్తి వ్యవహారాలు కొనసాగుతున్న నేపథ్యంలో కుటుంబ సభ్యుల మధ్య వివాదం న్యాయస్థానం వరకు చేరింది.

నేటి నుంచి కొత్త పాలన



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో నూతనంగా ఎన్నికైన పాలకవర్గాల తొలి సమావేశాలు నవంబర్ 23న నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో నూతన మేయర్లు, చైర్‌పర్సన్లు, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనుండగా, అదే రోజు డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది.

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం–1994లోని సెక్షన్ 7(1)(a), ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం–1965లోని సెక్షన్ 20(1)(a) ప్రకారం ఎన్నికైన సభ్యుల ఐదేళ్ల పదవీకాలం తొలి సమావేశం జరిగిన తేదీ నుంచి ప్రారంభమవుతుంది. ఈ నిబంధనల మేరకు నవంబర్ 23ను తొలి సమావేశాల తేదీగా నిర్ణయించారు.

రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ సమావేశాలు జరగనున్నాయి. వీటితో పాటు 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ ఒకే రోజు సమావేశాలు నిర్వహించనున్నారు.

తొలి సమావేశాల్లో నూతనంగా ఎన్నికైన మేయర్లు, చైర్‌పర్సన్లు వార్డు సభ్యులతో చట్ట నిబంధనల ప్రకారం ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అనంతరం కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్లను, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వైస్ చైర్‌పర్సన్లను ఎన్నుకునే ప్రక్రియ చేపట్టనున్నారు. చట్ట నిబంధనల ప్రకారం డిప్యూటీ మేయర్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను తొలి సమావేశంలోనే లేదా ఆ సమావేశం జరిగిన తేదీ నుంచి రెండు వారాల్లోపు నిర్వహించే తదుపరి సమావేశంలో చేపట్టేందుకు అవకాశం ఉంది. అయితే రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ ఎన్నికలను కూడా నవంబర్ 23నే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తొలి సమావేశాల నిర్వహణ, సభ్యుల ప్రమాణ స్వీకారం, డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్లను రాష్ట్ర ఎన్నికల సంఘం, ఎన్నికల ప్రాధికార సంస్థ ఆదేశించాయి.

దీంతో నవంబర్ 23 నుంచి రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థల్లో నూతన పాలకవర్గాల ఐదేళ్ల పాలన అధికారికంగా ప్రారంభం కానుంది. పట్టణాల అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారంలో కొత్త పాలకవర్గాల పాత్ర కీలకం కానుంది.

పోలింగ్ కేంద్రాల కుదింపు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : పంచాయతీ ఎన్నికల నిర్వహణలో వ్యయాన్ని తగ్గించి, ప్రక్రియను సులభతరం చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. వార్డు సభ్యుల స్థానాలన్నీ ఏకగ్రీవమై, సర్పంచి పదవికి మాత్రమే ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల విలీనానికి అనుమతించింది. ఒకే ప్రాంగణంలో, ఒకే ప్రాంతంలో ఉన్న కేంద్రాలను మాత్రమే కలిపేందుకు వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

650 మందికి మించరాదు: విలీనం చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 650 మందికి మించకూడదని ఎస్ఈసీ స్పష్టం చేసింది. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం సిబ్బందిని నియమించాలని ఆదేశించింది. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విలీనం చేయరాదని తేల్చిచెప్పింది.

ఓటర్లకు ముందస్తు సమాచారం : విలీనం చేసిన కేంద్రాల వద్ద ఓటర్లకు మార్గనిర్దేశం చేసేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించింది. పోలింగ్ కేంద్రాల మార్పు, విలీనంపై ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి. పోటీలో ఉన్న అభ్యర్థులకు కూడా ముందుగానే సమాచారం అందించాలి.


ఖర్చులు తగ్గించేందుకే.. : ఎన్నికల నిర్వహణలో పోలీసు బందోబస్తు, సిబ్బంది నియామకం, రవాణా తదితర ఖర్చులను తగ్గించడంతోపాటు పోలింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.

చౌదరివారిపల్లి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన లింగం దిన్నె రమాదేవి



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్) :బ్రహ్మం గారి మఠం మండలంలోని సర్పంచుల నామినేషన్ ప్రక్రియలో భాగంగా టి చౌదరి పల్లి గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా లింగం దిన్నె రమాదేవి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి రమాదేవి మాట్లాడుతూ టి చౌదరి వారి పల్లి గ్రామ ప్రజలు నన్ను అత్యధిక మెజార్టీ ఓట్లు వేసి సర్పంచ్ గా గెలిపించాలని రాబోయే రోజుల్లో గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తారని బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కొరకు తమ వంతు కృషి చేస్తారని సర్పంచ్ అభ్యర్థి లింగం దిన్నె రమాదేవి మరియు ఆమె భర్త లింగం దిన్నె సిద్ధారెడ్డి చౌదరి వారి పల్లి పంచాయతీ ప్రజలకు తెలియజేశారు.

పంచాయతీల్లో ఏకగ్రీవాలకే పెద్దపీట!



(మొదటి పేజీ తరువాయి)

అభివర్ణించారు. పార్టీ గుర్తులపై జరిగిన ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని సూచించారు.

అభివృద్ధికి నజరానా: గ్రామపంచాయతీల్లో పోటీ కంటే అభివృద్ధికే ప్రాధాన్యమివ్వాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు తెలిపారు. గతంలో గరిష్ఠంగా రూ.20 లక్షలుగా ఉన్న ఈ మొత్తాన్ని రూ.50 లక్షలకు పెంచిన విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ఏకాభిప్రాయంతో ఎన్నికలు జరిగితే ప్రభుత్వ ప్రోత్సాహక నిధులను గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు వినియోగించుకోవచ్చని వివరించాలన్నారు.

పంతాలు వీడండి.. ఐక్యంగా సాగండి: గ్రామస్థాయి నాయకుల మధ్య పోటీలు, వ్యక్తిగత విభేదాలు, ఈగోలను పక్కనపెట్టి సమష్టిగా పనిచేయాలని సీఎం ఆదేశించారు. పార్టీల మధ్య ఎన్నికల పోరు ముగిసిందని, ఇప్పుడు గ్రామాల అభ్యున్నతే ప్రధాన లక్ష్యం కావాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని నాయకులతో చర్చించి, అందరి అంగీకారంతో ఏకగ్రీవాలకు మార్గం సుగమం చేయాలని దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా నేతలు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

బాపట్లలో కూటమి విజయ ఢంకా..!

- ప్రజల ఆశీర్వాదంతో దూసుకుపోతున్న కూటమి అభ్యర్థులు....



బాపట్ల, నవంబరు 22(జర్నలిస్ట్ ఫైల్) :బాపట్ల మున్సిపల్ ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పట్టణంలో ఎక్కడ చూసినా కూటమి జెండాలే,కూటమి నినాదాలే.ప్రజలంతా స్వచ్ఛందంగా తరలివచ్చి కూటమి అభ్యర్థులకు తమ మద్దతు తెలియజేస్తున్నారు.బాపట్ల మున్సిపల్ చైర్మన్‌గా బీజేపీ అభ్యర్థి డాక్టర్ ఇస్కా సునీల్ కుమార్ 25 వార్డులో ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రచారంలో దూసుకుపోతున్నా ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్,ఎమ్మెల్సీ పోతుల సునీత, గుడిపాటి సుజాత కౌన్సిలర్ అభ్యర్థి,బిజెపి స్టేట్ మీడియా కోఆర్డినేటర్ కిలారు దిలీప్ కూటమి చైర్మన్ అభ్యర్థి ఇస్కాసునీల్

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ప్రచారంతో జోష్

బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ స్వయంగా రంగంలోకి దిగి ప్రచారం చేయడంతో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వచ్చింది.జనసేన నాయకులు కూడ ప్రచారంలో పాల్గొని కూటమి శ్రేణులను ఉత్సాహపరుస్తున్నారు.శనివారం 25 వార్డు మరియు పట్టణ పలు వార్డుల్లో ప్రచారం ముమ్మరం.

అభివృద్ధికే ప్రజలు ఓటు:"గతంలో ఎన్నడూ లేని విధంగా బాపట్లలో అభివృద్ధి జరుగుతోంది.రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు,పారిశుధ్యం, లైట్లు...ప్రతి వార్డులో పనులు జరుగుతున్నాయి.ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలి" అని ప్రజలు అంటున్నారు.

ఇంటింటి ప్రచారంలో మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని కూటమి అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్నారు. బీజేపీ, టీడీపీ,జనసేన కార్యకర్తలు ముగ్గురు కలిసి ఒకే కుటుంబంలా పనిచేస్తున్నారు.

బాపట్ల గెలుపు ఖాయం...ప్రచారంలో కనిపిస్తున్న జన స్పందన చూస్తుంటే బాపట్లలో కూటమి చరిత్ర సృష్టించబోతోందని రాజకీయ విశ్లేషకులు కూడా అంటున్నారు. చైర్మన్ స్థానంలో డా. సునీల్‌కుమార్ భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని కూటమి శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

ఈ ప్రచారంలో కార్యక్రమంలో ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ పోతుల సునీత,గుడిపాటి సుజాత కౌన్సిలర్ అభ్యర్థి బిజెపి స్టేట్ మీడియా ఇంచార్జ్ కిలారు దిలీప్,బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని శర్మ, బిజెపి,జనసేన,తెలుగుదేశం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టెస్టుల్లో టీమ్ఇండియా ప్రపంచ రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

50కి పైగా పరుగుల భాగస్వామ్యాలు నమోదు చేసిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించారు.

భాగస్వామ్యాల హోరు: తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 130 పరుగులు జోడించారు. జైస్వాల్ 85 పరుగులు చేసి వెనుదిరగ్గా.. రాహుల్ తన జోరును కొనసాగించాడు. దేవదత్ పడిక్కల్ (80)తో కలిసి రెండో వికెట్‌కు 165 పరుగులు జత చేశాడు. అనంతరం కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి మూడో వికెట్‌కు 91 పరుగులు సాధించాడు. ఈ క్రమంలో రాహుల్ 136 పరుగులతో శతకం బాదాడు.

పంత్ పునరాగమన శతకం: గాయం నుంచి తిరిగొచ్చిన రిషబ్ పంత్ తనదైన శైలిలో చెలరేగాడు. దూకుడుగా ఆడుతూ 128 పరుగులతో శతకం సాధించాడు. గిల్‌తో కలిసి నాలుగో వికెట్‌కు శతక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆతర్వాత నైట్‌వాచ్‌మన్ అన్షుల్ కంబోజ్‌తో ఐదో వికెట్‌కు 75 పరుగులు జోడించాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి ఆరో వికెట్‌కు 54 పరుగులు సాధించాడు. అనంతరం జురెల్, వాషింగ్టన్ సుందర్ ఏడో వికెట్‌కు మరో 54 పరుగులు జత చేశారు.

రికార్డుల మోత: భారత ఇన్నింగ్స్‌లో తొలి ఏడు వికెట్లకు 50కి పైగా పరుగుల భాగస్వామ్యాలు నమోదవడం విశేషం. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇలాంటి ఘనత సాధించిన తొలి జట్టుగా భారత్ నిలిచింది. రాహుల్, పంత్ శతకాలు.. జైస్వాల్, పడిక్కల్ అర్ధశతకాలతో భారత ఇన్నింగ్స్ పరుగుల ప్రవాహంలా సాగింది. చివరకు 720/9 వద్ద కెప్టెన్ గిల్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు.


న్యూజిలాండ్ గడ్డపై అత్యధికం: భారత్ సాధించిన 720 పరుగులు న్యూజిలాండ్‌పై టెస్టుల్లో ఏ జట్టుకైనా అత్యధిక స్కోరు. 1995లో ఇదే వెల్లింగ్టన్ మైదానంలో వెస్టిండీస్ నమోదు చేసిన 660/5 రికార్డును టీమ్ఇండియా అధిగమించింది. అలాగే న్యూజిలాండ్ గడ్డపై టెస్టుల్లో నమోదైన అత్యధిక ఇన్నింగ్స్ స్కోరుగా కూడా నిలిచింది. 2019లో బంగ్లాదేశ్‌పై న్యూజిలాండ్ సాధించిన 715/6 పరుగుల రికార్డు కనుమరుగైంది. తొలి ఇన్నింగ్స్‌లో 352 పరుగుల ఆధిక్యం సాధించిన భారత్ మ్యాచ్‌పై పట్టు బిగించింది.

దమ్ముంటే చర్చకు రండి

(మొదటి పేజీ తరువాయి)

సవాల్ స్వీకరిస్తారా? పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పన, రాష్ట్ర అభివృద్ధిపై పూర్తి స్థాయిలో చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని లోకేశ్ స్పష్టం చేశారు. ఇదే అంశాలపై బహిరంగ చర్చకు జగన్ ముందుకు రావాలని సవాల్ విసిరారు. 'ఇది మా ట్రాక్ రికార్డు. నా సవాల్‌ను స్వీకరించడానికి మీరు సిద్ధమేనా?' అంటూ సామాజిక మాధ్యమ వేదికగా ప్రశ్నించారు.

బిస్లెరీ నీటిలో ప్రమాదకర రసాయనాలు



న్యూఢిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్) : ప్రముఖ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తయారీ సంస్థ బిస్లెరీ ఇంటర్నేషనల్‌కు చిక్కులు ఎదురయ్యాయి. ఆ సంస్థకు చెందిన తాగునీటి నమూనాల్లో ప్రమాదకర రసాయనాలు ఉన్నట్లు రెండు దశల్లో నిర్వహించిన ప్రయోగశాల పరీక్షల్లో వెల్లడైంది. దీంతో ఆ సంస్థపై చట్టపరమైన చర్యలకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సిద్ధమైంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 కింద ప్రాసిక్యూషన్ ప్రక్రియ ప్రారంభించేందుకు అనుమతించినట్లు ప్రకటించింది.

బిస్లెరీ ప్రాంగణం నుంచి అధికారులు సేకరించిన ప్యాకేజ్డ్ తాగునీటి నమూనాలను తొలుత ప్రయోగశాలలో పరీక్షించారు. అందులో బ్రోమేట్ పరిమాణం నిర్దేశిత ప్రమాణాలకు మించి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ నీటిని సురక్షితం కానిదిగా ప్రకటించారు. ఈ ఫలితాలపై బిస్లెరీ అప్పీల్ చేయడంతో నమూనాలను మరింత సమగ్ర పరీక్షల కోసం రెఫరల్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లోనూ అవి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. అంతేకాకుండా పాలీన్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్ (పీఏహెచ్) ఉన్నట్లు గుర్తించారు. బ్రోమేట్, పీఏహెచ్‌లను ప్రమాదకరమైన, క్యాన్సర్ ముప్పుతో సంబంధం ఉన్న రసాయనాలుగా పరిగణిస్తారు. రెండు ప్రయోగశాలల నివేదికల్లోనూ నిబంధనల ఉల్లంఘన వెల్లడవడంతో బిస్లెరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి మంజూరు చేసింది. ఈ వ్యవహారంపై బిస్లెరీ సంస్థ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. మరోవైపు ప్రముఖ మిఠాయిల తయారీ సంస్థ ఆశా కన్ఫెక్షనరీకి చెందిన చాక్లెట్ ఫిల్డ్ కుకీలపైనా ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా ఝళిపించింది. ఆ ఉత్పత్తి లేబులింగ్, పదార్థాల నాణ్యత, భద్రతా ప్రమాణాల్లో లోపాలు గుర్తించడంతో ప్రభావిత బ్యాచ్‌ను వెంటనే మార్కెట్ నుంచి వెనక్కి తీసుకోవాలని ఆదేశించింది.

పరీక్షల్లో లేబుల్‌పై పేర్కొనని కార్సినోసిన్ అనే కృత్రిమ రంగును గుర్తించారు. అనుమతించిన పరిమితికి మించి టార్ట్రాజైన్ ఉన్నట్లు, ఈ తరహా ఆహార పదార్థాల్లో వినియోగించకూడని సన్‌సెట్ ఎల్లో ఎఫ్‌సీఎఫ్ రంగును కూడా కలిపినట్లు నిర్ధారించారు. దీంతో ఆ కుకీల బ్యాచ్‌ను నిబంధనలకు విరుద్ధమైనదిగా ప్రకటిస్తూ మార్కెట్ నుంచి పూర్తిగా ఉపసంహరించుకోవాలని సంస్థను ఆదేశించింది.

బాలకృష్ణ పిఎ కంపెనీలో మారణాయుధాలు...

గుంటూరు : మారణాయుధాలు కలిగి ఉన్న ఆరోపణలపై పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురం లో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిఎ పావులూరి శ్రీనివాసరావుతో సహా 66 మందిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకొని నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేశారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుకు, పావులూరి శ్రీనివాసరావుకు మధ్య ఉన్న విభేదాల నేపథ్యంలో తిమ్మాపురం సర్పంచు స్థానానికి టిడిపి మద్దతుదారులుగా ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పత్తిపాటి అనుచరుడు నాగళ్ల రాంబాబు, పావులూరి శ్రీనివాసరావు బంధువు పావులూరి పిచ్చయ్య నామినేషన్లు వేశారు. ఈ ఎన్నికలను పుల్లారావుకు, శ్రీనివాసరావు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. తిమ్మాపురం గ్రామంలోగల శ్రీనివాసరావుకు చెందిన జిన్నింగ్ కంపెనీలో మారణాయుధాలు ఉన్నాయంటూ పోలీసులకు పుల్లారావు అనుచరులు సమాచారమిచ్చారు. పోలీసుల సోదాలో ఈ కంపెనీలో కర్రలు, కత్తులు దొరకడంతో వాటిని స్వాధీనం చేసుకొని శ్రీనివాసరావుతోపాటు గ్రామానికి చెందిన ఆయన అనుచరులు 66 మందిని అరెస్టు చేసి నాదెండ్ల పోలీసు స్టేషన్‌కు తరలించి నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది గుంటూరు నుంచి 25 కార్లలో వచ్చి పోలీస్ స్టేషన్ వద్ద హల్‌చల్ చేశారు. పోలీసులు లాఠీఛార్జి చేసి వారిని చెదరగొట్టి 25 కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎఎస్‌పి ఎం.హనుమంతరావు తెలిపారు.

మోదీ ముందుచూపుకు నీరాజనం



న్యూఢిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్) : బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలంటూ గతంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విజ్ఞప్తి వ్యాపారులు, ఆభరణాల తయారీదారులు, పెట్టుబడిదారులకు ఎంతో మేలు చేసిందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) పేర్కొంది. బంగారం ధరలు భారీగా తగ్గిన నేపథ్యంలో ప్రధాని ముందుచూపును ప్రశంసిస్తూ నవంబరు 22న ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది. ఆ సమయంలో ప్రధాని పిలుపుపై కొన్ని వర్గాల నుంచి విమర్శలు వచ్చినప్పటికీ.. తాజాగా ధరలు పడిపోవడంతో ఆ సూచన ఎంత ప్రయోజనకరమో స్పష్టమైందని అభిప్రాయపడింది.

'మీ ముందుచూపు లక్షలాది మంది ఆభరణాల వ్యాపారులు, పెట్టుబడిదారులను అప్పుల ఊబిలో పడకుండా కాపాడింది' అనే శీర్షికతో ప్రధానికి రాసిన లేఖలో సీటీఐ ధరల తగ్గుదలను వివరించింది. ప్రధాని బంగారం కొనుగోళ్ల తగ్గింపుపై పిలుపునిచ్చిన సమయంలో కిలో బంగారం ధర రూ.1.90 కోట్లుగా ఉండగా.. ప్రస్తుతం రూ.1.25 కోట్లకు దిగివచ్చిందని తెలిపింది. అంటే కిలోపై ఏకంగా రూ.65 లక్షల మేర తగ్గిందని పేర్కొంది. అప్పట్లో వ్యాపారులు అధిక ధరలకు పెద్దవత్తున బంగారం నిల్వలు కొనుగోలు చేసి ఉంటే భారీ ఆర్థిక నష్టాలను చవిచూడాల్సి వచ్చేదని వివరించింది.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మాధ్యమాల ద్వారా వ్యాపారం చేసే చిన్న వ్యాపారులు, స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారులు సైతం అధిక ధరల వద్ద కొనుగోళ్లకు దూరంగా ఉండటం వల్ల నష్టాల నుంచి బయటపడ్డారని వెల్లడించింది. తొలుత ప్రధాని సూచనను వ్యతిరేకించిన వ్యాపారులు కూడా ఇప్పుడు దాని ప్రయోజనాలను గుర్తిస్తున్నారని పేర్కొంది.

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో బంగారం ధరలు తగ్గడం వినియోగదారులకు ఊరటనిచ్చిందని సీటీఐ తెలిపింది. ఆభరణాల కొనుగోలుకు సిద్ధమవుతున్న మధ్యతరగతి కుటుంబాలకు ఈ పరిణామం ప్రయోజనకరంగా మారిందని పేర్కొంది. భవిష్యత్తులోనూ బంగారం, వెండి వంటి సున్నితమైన మార్కెట్లలో వ్యాపారులు నష్టపోకుండా ఉండేందుకు సమయానుకూలంగా మార్గదర్శకత్వం అందించాలని ప్రధానిని కోరింది.

కాగా, లక్నోలో అంతకుముందు రోజు జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలని తాను చేసిన విజ్ఞప్తికి ప్రజల నుంచి సానుకూల స్పందన లభించిందని గుర్తుచేశారు. పశ్చిమాసియా సంక్షోభం, ముడిచమురు ధరల పెరుగుదల నేపథ్యంలో 2026 మే 10న సికింద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో బంగారం కొనుగోళ్ల తగ్గింపు, ఇంధన పొదుపు, స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం తదితర ఏడు అంశాలపై దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

సరిహద్దు గ్రామాలకు మళ్లీ కళ



ఇటానగర్, నవంబరు 22 (జర్నలిస్ట్‌ఫైల్) : చైనా సరిహద్దుల్లోని గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. గతంలో ఉపాధి, మౌలిక సదుపాయాల కొరతతో గ్రామాలను విడిచివెళ్లిన ప్రజలు ఇప్పుడు తిరిగి స్వగ్రామాలకు చేరుకుంటున్నారని వెల్లడించారు. సుమారు 40 సరిహద్దు గ్రామాలకు ప్రజలు తిరిగొచ్చారని పేర్కొన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సరిహద్దు గ్రామాల అభివృద్ధి, వలసల నివారణ, స్వయం సమృద్ధిపై కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించారు.

కేంద్రం అమలు చేస్తున్న వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్ ద్వారా చైనా సరిహద్దు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. రహదారులు, విద్యుత్తు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని చెప్పారు. స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు వివరించారు.

సరిహద్దు గ్రామాల్లో ఉత్పత్తి అయ్యే పాలు, గుడ్లు, కూరగాయలు, చిరుధాన్యాలకు భారత సైన్యం, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) ప్రాధాన్యమిస్తున్నాయని హోంమంత్రి వెల్లడించారు. స్థానిక రైతులు, సహకార సంఘాల నుంచి వీటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో గ్రామీణులకు ఆదాయం పెరగడమే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయని పేర్కొన్నారు. పాలు, చేపలు, మాంసం, గుడ్ల ఉత్పత్తిని పెంచి గ్రామాలను ఆర్థికంగా స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

అరుణాచల్ ప్రదేశ్‌లో రూ.5,610 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించినట్లు అమిత్ షా తెలిపారు. రాష్ట్రంలోని 11 సరిహద్దు జిల్లాల్లో వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్ కింద రూ.110.95 కోట్లతో 199 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సరిహద్దు గ్రామాలు దేశ భద్రతలో కీలక పాత్ర పోషిస్తాయని, అక్కడి ప్రజలకు మెరుగైన జీవన సదుపాయాలు, ఉపాధి కల్పిస్తే వలసలను అరికట్టవచ్చని పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌లో హింసాకాండ .. అవామీ లీగ్ నేతల ఇళ్లకు నిప్పు



ఢాకా : బంగ్లాదేశ్‌లో హింసాకాండ తీవ్రరూపం దాల్చింది. నరైల్ జిల్లాలో అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలకు చెందిన ఆస్తులపై దాడులు జరిగాయి. సుమారు 30 ఇళ్లకు నిప్పు పెట్టినట్లు స్థానిక మీడియా ఆదివారం వెల్లడించింది. పలు ఇళ్లు, దుకాణాలను ధ్వంసం చేయడంతో పాటు దోచుకున్నట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.

వివరాల ప్రకారం.. కాలియా ఉపజిల్లాలోని బెందర్‌చార్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం నుండి హింసాత్మక ఘటనలు చెలరేగాయి. అవామీ లీగ్ మాజీ ఎమ్మెల్యే బి.ఎం. కబీరుల్ హక్ ముక్తి, కాలియా మున్సిపాలిటీ మాజీ మేయర్ ముఖ్తికుర్ రెహమాన్ లిటన్, స్థానిక పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణపాద ఘోష్‌ల నివాసాలపై దాడులు జరిగాయి. గ్రామానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. సుమారు 50 ఇళ్లు, దుకాణాలు ధ్వంసమైనట్లు, దోపిడీకి గురైనట్లు స్థానిక మీడియా తెలిపింది. ఈ దాడుల వెనుక అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) మద్దతుదారులు ఉన్నారని పేర్కొంది. మాజీ ఎమ్మెల్యే ఇంటితో సహా పలు ఇళ్లను ధ్వంసం చేశారని, ఐదు నుండి ఆరు ఇళ్లకు నిప్పు పెట్టారని కాలియా ఉపజిల్లా కార్యనిర్వాహక అధికారి మహ్మద్ జిన్నతుల్ ఇస్లాం పేర్కొన్నారు. అయితే దాడులకు బాధ్యులెవరన్నది ఇంకా నిర్ధారణ కాలేదని, దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు. నవంబర్ 18న బిఎన్‌పి మోటార్‌సైకిళ్ల ర్యాలీపై జరిగిన దాడిలో ఆ పార్టీకి చెందిన ఇద్దరు నేతలు హత్యకు గురైన సంగతి తెలిసిందే. దీంతో మృతుల కుటుంబసభ్యులు, మద్దతుదారులు అవామీలీగ్ నేతలు, కార్యకర్తల ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నట్లు నరైల్ జిల్లా పోలీసులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చామని, అదనపు బలగాలను మోహరించామని వెల్లడించారు.

జబర్దస్త్ కమెడియన్లకు గాయాలు



భీమవరం (పశ్చిమ గోదావరి) : ప్రముఖ కామెడీ షో 'జబర్దస్త్' ఆర్టిస్టులు దొరబాబు, రైజింగ్ రాజు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని పాలకోడేరు మండలం గోరగనమూడి వద్ద శనివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కాకినాడలో జనసేన అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం ముగించుకుని తిరిగి వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. గోరగనమూడి వద్దకు రాగానే దొరబాబు ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో కారులో ఉన్న దొరబాబు, రైజింగ్ రాజులకు గాయాలు కాగా, కారు నడుపుతున్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. కారులో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి హుటాహుటిన భీమవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పాలకోడేరు పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అతివేగమా లేక నిద్రమత్తు కారణమా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. తమ అభిమాన కమెడియన్లకు ప్రమాదం జరిగిందని తెలియడంతో జబర్దస్త్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తూ, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

ఎన్విడియా చిప్స్ వెనుక చైనా మాస్టర్‌మైండ్



న్యూఢిల్లీ(జర్నలిస్ట్‌ఫైల్) : ప్రపంచ ప్రఖ్యాత చిప్ తయారీ సంస్థ ఎన్విడియా వ్యవహారం మరో కీలక మలుపు తిరిగింది. ఆ సంస్థ సీఈవో జెన్సన్ హువాంగ్‌కు రాజీనామా చేసే పరిస్థితి తీసుకొచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అలిస్ వ్యవహారం వెనుక అసలు సూత్రధారి చైనాకు చెందిన వ్యాపారి లి మింగ్ అని 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్' సంచలన కథనం ప్రచురించింది. అలిస్, ఆమె భర్త కాంగ్ వియ్‌ను ముందుపెట్టి.. తెరవెనుక నుంచి మొత్తం వ్యవహారాన్ని లి మింగ్ నడిపించారని వెల్లడించింది. అమెరికా ఎగుమతి ఆంక్షలను ఉల్లంఘించి అత్యాధునిక ఎన్విడియా చిప్‌లను చైనా కంపెనీలకు చేరవేసేందుకు భారీ నెట్‌వర్క్ ఏర్పాటు చేసినట్లు ఆరోపించింది. ఈ మార్గంలో సుమారు 7.5 బిలియన్ డాలర్ల విలువైన చిప్‌లు చైనాకు చేరినట్లు పేర్కొంది.

సింగపూర్ కేంద్రంగా పనిచేసే మెగాస్పీడ్ సంస్థలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసిన అలిస్‌తో లి మింగ్‌కు పరిచయం ఏర్పడింది. సంస్థ నిర్వహణ, కీలక నిర్ణయాల్లో మింగ్ చక్రం తిప్పేవారని కథనం తెలిపింది. అలిస్‌కు పదోన్నతి కల్పించి కీలక బాధ్యతలు అప్పగించడంతోపాటు.. ఆమెను ముందుపెట్టి తెరవెనుక నుంచి వ్యవహారాలను చక్కబెట్టేవారని వివరించింది. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతకు అత్యంత కీలకమైన అధునాతన చిప్‌లను చైనాకు తరలించేందుకు పలు కంపెనీలతో కూడిన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఎన్విడియాతో వ్యాపార సంబంధాలున్న ఇతర సంస్థలతోనూ లి మింగ్‌కు సంబంధాలు ఉన్నట్లు వెల్లడించింది.

ఎన్విడియా కంప్యూటర్ సర్వర్లను ఇతర దేశాలకు మళ్లించారనే ఆరోపణలపై గతేడాది ఫిబ్రవరిలో సింగపూర్‌లో లి మింగ్‌పై కేసు నమోదైంది. మెగాస్పీడ్ సంస్థ అవసరాల కోసమంటూ ఎన్విడియాను నమ్మించి భారీగా ఏఐ చిప్‌లను కొనుగోలు చేసినట్లు సింగపూర్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అనంతరం వాటిని మలేసియాకు తరలించి.. అక్కడి నుంచి మరో దేశానికి అక్రమంగా సరఫరా చేసినట్లు అభియోగాలు నమోదయ్యాయి. అయితే ఆ దేశం పేరును అధికారులు వెల్లడించలేదు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. కేసులో బెయిల్‌పై ఉన్న లి మింగ్.. సింగపూర్‌లోని చైనా రాయబార కార్యాలయానికి సమీపంలోని విలాసవంతమైన విల్లాలో నివసిస్తున్నట్లు సమాచారం.

అలిస్, ఆమె భర్త కాంగ్ వియ్‌తో లి మింగ్‌కు చాలాకాలంగా వ్యాపార సంబంధాలు ఉన్నట్లు కథనం పేర్కొంది. జో బైడెన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎన్విడియా అధునాతన చిప్‌లను చైనాకు ఎగుమతి చేయడంపై అమెరికా ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో ఆగ్నేయాసియా దేశాల మీదుగా చైనా వినియోగదారులకు చిప్‌లను చేరవేసేందుకు ఈ ముగ్గురూ తమ నెట్‌వర్క్‌ను విస్తరించినట్లు వెల్లడించింది. అయితే జెన్సన్-అలిస్ వ్యవహారం వెలుగులోకి వచ్చేంతవరకు వీరి సంబంధాలు బయటపడలేదని తెలిపింది. అలిస్ ఎన్విడియా అధిపతికి వ్యక్తిగత సహాయకురాలిగా పనిచేస్తున్న విషయాన్ని ఆమె భర్త కాంగ్ వియ్ తన సహచరులతో సరదాగా ప్రస్తావించేవారని కొన్ని నివేదికలు చెబుతున్నాయి.

మెగాస్పీడ్ సంస్థ కార్యకలాపాలపై అమెరికా, సింగపూర్ అధికారులు విస్తృతంగా దర్యాప్తు చేస్తున్నారు. ఎగుమతి ఆంక్షలు అమల్లో ఉన్నప్పటికీ ఎన్విడియా అత్యాధునిక చిప్‌లు చైనా కంపెనీలకు ఎలా చేరాయన్న అంశంపై ఆరా తీస్తున్నారు. ఎన్విడియా సాంకేతికతను మెగాస్పీడ్ కొనుగోలు చేసి అక్రమ మార్గంలో చైనా టెక్నాలజీ దిగ్గజం అలీబాబాకు సరఫరా చేసినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం వెల్లడించింది. అయితే తాము ఎగుమతి నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నామని, ఎలాంటి తప్పు చేయలేదని మెగాస్పీడ్ వాదిస్తోంది. ఈ వ్యవహారంపై దర్యాప్తు పూర్తయితే మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

కేంద్ర మంత్రి జైశంకర్‌తో నేపాల్ ప్రధాని బలేంద్ర షా భేటీ..



న్యూఢిల్లీ: నేపాల్ ప్రధానమంత్రి బలేంద్ర షా రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇవాళ (ఆదివారం) న్యూఢిల్లీలో వారిద్దరూ సమావేశమయ్యారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ కేంద్ర మంత్రి ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. ఈ సందర్భంగా నేపాల్ ప్రధానిని కలవడం సంతోషంగా ఉందని జైశంకర్ పేర్కొన్నారు. ఆ దేశంతో సన్నిహిత సంబంధాలకు భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు భారత్‌కు షా వచ్చారని తెలిపారు. ఆ దేశంతో స్నేహాన్ని భారత్ ఎంతో విలువైనదిగా భావిస్తోందని పేర్కొన్నారు. సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో షా భేటీ కోసం ఎదురుచూస్తున్నట్లు జైశంకర్ వెల్లడించారు.

కాగా, సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో నేపాల్ ప్రధాని బలేంద్ర షా భేటీ కానున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల నేతలు ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం.. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, వ్యాపారం, అభివృద్ధి సహకారం, ఇంధనం, జలవనరులు వంటి అంశాలు చర్చకు రానున్నాయి. అలాగే, డిజిటల్ అనుసంధానం, స్టార్టప్‌లు, సాంకేతికత, ఆవిష్కరణలు, క్రీడలు వంటి కొత్త రంగాలపైనా దృష్టి సారించనున్నారు. జలవిద్యుత్, రైల్వేలు, మౌలిక సదుపాయాలు, సరిహద్దు సహకారాన్ని మరింతగా పెంపొందించుకునే మార్గాలను అన్వేషించనున్నారు. ఇప్పటికే పూర్తయిన పలు ప్రాజెక్టులను ప్రారంభించే అవకాశం ఉండగా.. కొత్త అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికలను ఇరుపక్షాలు ముందుకు తీసుకెళ్లనున్నాయి.

ఈ పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కూడా నేపాల్ ప్రధాని కలవనున్నారు. కాగా, మార్చి 2026లో పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత షా.. భారత్‌కు రావడం ఇదే తొలిసారి. అలాగే, ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇదే ఆయన తొలి ద్వైపాక్షిక విదేశీ పర్యటన కావడం గమనార్హం.

జర్నలిస్ట్ ఫైల్ JOURNALIST FILE
సంపాదక స్వరం EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం

పోలవరం పూర్తయితే.. ప్రగతికి కొత్త బాటలు


వ్యవసాయానికి ఊతం.. పారిశ్రామిక రంగానికి జల భరోసా.. ప్రజలకు తాగునీరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తును మార్చగలిగే అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు పోలవరం. దశాబ్దాలుగా రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా రైతాంగం ఎదురుచూస్తున్న ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణం ఇప్పుడు మరో కీలక దశకు చేరుకుంటోంది. తొలి దశ పనులను 2027 మే నాటికి సిద్ధం చేయాలన్న లక్ష్యం ప్రాజెక్టుపై కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. గోదావరి నదీ జలాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించడం, కరువు ప్రభావాన్ని తగ్గించడం, తాగునీటి అవసరాలను తీర్చడం, పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడటం వంటి అనేక లక్ష్యాలతో చేపట్టిన పోలవరం పూర్తయితే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుంది. ఒక భారీ సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం అంటే కేవలం ఆనకట్ట కట్టడం మాత్రమే కాదు. దానికి అనుబంధంగా కాలువలు, జలాశయం, భూసేకరణ, పునరావాసం, విద్యుత్ ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక అంశాలు ముడిపడి ఉంటాయి. అందుకే పోలవరం నిర్మాణాన్ని రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యమైన మౌలిక వసతుల ప్రాజెక్టుగా చూడాలి. నిర్దిష్ట గడువులో పనులు పూర్తిచేయడం ఎంత ముఖ్యమో, నిర్మాణ నాణ్యత, సాంకేతిక ప్రమాణాలు, నిర్వాసితులకు న్యాయం కూడా అంతే ముఖ్యం.

దశాబ్దాల కల.. సాకారానికి చేరువ : గోదావరి నదిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి వరప్రదాయినిగా మారుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. గోదావరి జలాల్లో సముద్రంలో కలిసిపోయే నీటిని సాధ్యమైనంత మేర వినియోగంలోకి తీసుకురావడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశాల్లో ఒకటి. రాష్ట్రంలోని నీటి కొరత ప్రాంతాలకు జలాలను మళ్లించడం ద్వారా వ్యవసాయ రంగానికి స్థిరత్వం కల్పించవచ్చు. సాగునీటి కోసం వర్షాలపై ఆధారపడే రైతులకు భరోసా లభిస్తుంది. పంటల సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు వ్యవసాయ ఉత్పాదకత మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.

పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించడం, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారం అందించడం దీని ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి. ప్రాజెక్టు తొలి దశకు కేంద్ర ప్రభుత్వం రూ.30,436.95 కోట్ల వ్యయాన్ని ఆమోదించింది. ఈ దశలో జలాశయంలో నీటి నిల్వను 41.15 మీటర్ల స్థాయికి తీసుకెళ్లే పనులు ప్రధానంగా ఉన్నాయి. పూర్తి ప్రాజెక్టు రూపకల్పనలో 45.72 మీటర్ల పూర్తి జలాశయ స్థాయి లక్ష్యంగా ఉంది. ఈ రెండు దశల మధ్య వ్యత్యాసాన్ని గుర్తిస్తూ పనుల ప్రణాళికను అమలు చేయాలి.

నిర్మాణ పనుల్లో కీలక పురోగతి : పోలవరం నిర్మాణ పనులు కీలక దశకు చేరుకున్నాయి. 2026 సెప్టెంబరు నాటికి అందుబాటులో ఉన్న అధికారిక సమీక్ష వివరాల ప్రకారం ప్రాజెక్టు మొత్తం భౌతిక పురోగతి 90.1 శాతానికి చేరింది. అయితే ఆర్థిక పురోగతి, నిర్మాణ పురోగతి, పునరావాస పనుల పురోగతిని వేర్వేరుగా పరిశీలించాల్సి ఉంది. స్పిల్‌వే, గ్యాప్-3లో ప్రధాన ఆనకట్ట పనులు, డయాఫ్రం వాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, కుడి ప్రధాన కాలువ వంటి కీలక పనులు పూర్తయినట్లు సమీక్షల్లో వెల్లడైంది. అయితే ప్రధాన ఆనకట్టలోని గ్యాప్-1, గ్యాప్-2 పనులు, కాలువల అనుసంధానం, ఇతర మౌలిక వసతుల పనులు ఇంకా పూర్తిచేయాల్సి ఉంది. ఈ పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలి. భారీ యంత్రాలను వినియోగించడం, పనుల వేగాన్ని పెంచడం మాత్రమే కాకుండా ప్రతి నిర్మాణ దశలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి.



రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు : పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర వ్యవసాయ రంగానికి విశేష ప్రయోజనం చేకూరుతుంది. సుమారు 7.2 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీటి సౌకర్యం కల్పించడంతోపాటు మరో 23.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ ప్రయోజనం కలుగుతుందని ప్రాజెక్టు లక్ష్యాలు సూచిస్తున్నాయి. సాగునీటి లభ్యత పెరిగితే రైతులు ఒకే పంటపై ఆధారపడాల్సిన పరిస్థితి తగ్గుతుంది. పంటల మార్పిడి, ఉద్యాన పంటలు, వాణిజ్య పంటల సాగుకు అవకాశాలు పెరుగుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో వ్యవసాయ అనుబంధ రంగాలకు కూడా ఊతం లభిస్తుంది.

ప్రస్తుతం వర్షాభావం, భూగర్భ జలాల తగ్గుదల, సాగునీటి కొరత వంటి సమస్యలు అనేక ప్రాంతాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవడం రాష్ట్రానికి ఎంతో అవసరం. పోలవరం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన ప్రాజెక్టు కాదు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నీటి అవసరాలను అనుసంధానించే కీలక జలవనరుల ప్రణాళిక. ముఖ్యంగా గోదావరి నుంచి కృష్ణా నదీ పరివాహక ప్రాంతానికి 80 టీఎంసీల నీటిని మళ్లించే లక్ష్యం జలవనరుల సమతుల్య వినియోగానికి దోహదపడుతుంది.

ఉత్తరాంధ్రకు తాగునీరు.. పరిశ్రమలకు జల భరోసా : పోలవరం ప్రయోజనాలు వ్యవసాయానికే పరిమితం కావు. సుమారు 540 గ్రామాలకు తాగునీరు అందించడం ద్వారా దాదాపు 28.5 లక్షల మంది ప్రజలకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యం ఉంది. విశాఖపట్నం పట్టణ, పారిశ్రామిక ప్రాంత అవసరాలకు కూడా గోదావరి జలాలు కీలకంగా మారనున్నాయి. తాగునీరు, పారిశ్రామిక అవసరాల కోసం 23.44 టీఎంసీల నీటిని కేటాయించే ప్రణాళిక ఉంది. పరిశ్రమలకు నిరంతర నీటి సరఫరా అందుబాటులోకి వస్తే పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుంది.

రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి నీటి లభ్యత అత్యంత కీలకం. పరిశ్రమల స్థాపనకు భూమి, విద్యుత్, రవాణా సదుపాయాలతోపాటు నీటి వనరులు కూడా అవసరం. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడగలదు. అయితే వ్యవసాయం, తాగునీరు, పారిశ్రామిక అవసరాల మధ్య సమతుల్యత పాటిస్తూ జలాల పంపిణీకి దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలి.

నిర్వాసితుల కన్నీళ్లు తుడిచినప్పుడే ప్రాజెక్టుకు సార్థకత : పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడేటప్పుడు నిర్వాసితుల సమస్యలను విస్మరించకూడదు. జలాశయం నిర్మాణం కారణంగా తమ నివాసాలు, భూములు, జీవనాధారాలను కోల్పోతున్న కుటుంబాలకు న్యాయం చేయడం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన బాధ్యత. ప్రాజెక్టు నిర్మాణం ఎంత వేగంగా సాగుతున్నా పునరావాసం, పునఃస్థాపన పనులు అదే స్థాయిలో ముందుకు సాగాలి.

భూసేకరణ, పరిహారం, పునరావాస కాలనీల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి పునరుద్ధరణ వంటి అంశాల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదు. ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం మాత్రమే సరిపోదు. వారికి ఉపాధి, తాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించాలి. కొత్త ప్రాంతంలో స్థిరపడిన తర్వాత కూడా వారు గౌరవప్రదమైన జీవితం గడిపేలా చర్యలు తీసుకోవాలి.

అందుబాటులో ఉన్న అధికారిక సమీక్ష ప్రకారం భూసేకరణ పురోగతి 95.6 శాతంగా ఉండగా, పునరావాసం, పునఃస్థాపన పనుల పురోగతి 51.9 శాతంగా ఉంది. ఈ అంతరాన్ని తగ్గించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రాజెక్టు ప్రయోజనాలు లక్షలాది మందికి అందేలా కృషి చేస్తున్న సమయంలో, దాని కోసం త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలు నష్టపోకూడదు. అభివృద్ధి అంటే కొందరికి ప్రయోజనాలు కల్పించి మరికొందరిని నిర్లక్ష్యం చేయడం కాదు. అందరినీ కలుపుకొని ముందుకు సాగడమే నిజమైన అభివృద్ధి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం అవసరం : పోలవరం జాతీయ ప్రాజెక్టు కావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అత్యంత కీలకం. నిర్మాణానికి అవసరమైన నిధులు సకాలంలో విడుదల కావాలి. సాంకేతిక అనుమతులు, డిజైన్ల ఆమోదం, భూసేకరణ, పునరావాస కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగాలి. నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయే పరిస్థితి రాకూడదు. ప్రాజెక్టు పురోగతిని కేంద్ర స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ నిరంతరం సమీక్షించాలి.

పోలవరం తొలి దశకు ఆమోదించిన వ్యయంలో భాగంగా కేంద్రం నుంచి నిధులు విడుదలవుతున్నప్పటికీ, మిగిలిన నిధుల విడుదలకు సంబంధించిన ప్రక్రియ కూడా వేగంగా సాగాలి. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన వినియోగ ధ్రువీకరణ పత్రాలు, సాంకేతిక నివేదికలు సకాలంలో సమర్పించాలి. కేంద్రం కూడా తన బాధ్యతను నిర్వర్తిస్తూ ప్రాజెక్టుకు నిరంతర ఆర్థిక సహకారం అందించాలి.

లిలినాణ్యత విషయంలో రాజీకి తావుండకూడదు.

పోలవరం వంటి భారీ ప్రాజెక్టులో నిర్మాణ నాణ్యత అత్యంత కీలకం. ఆనకట్ట నిర్మాణంలో చిన్నపాటి సాంకేతిక లోపం కూడా భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలకు దారితీయవచ్చు. అందువల్ల నిర్మాణ పనులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలి. నిపుణుల పర్యవేక్షణ, మట్టి, రాతి నమూనాల పరీక్షలు, నిర్మాణ సామర్థ్య పరిశీలనలు నిరంతరం జరగాలి. కేంద్ర జల సంఘం, సంబంధిత సాంకేతిక సంస్థలు, నిపుణుల కమిటీలు అందించే సూచనలను అమలు చేయాలి. కాంట్రాక్టు సంస్థల పనితీరును క్రమం తప్పకుండా సమీక్షించాలి. గడువులు చేరుకోవాలనే తొందరలో నాణ్యతను విస్మరించకూడదు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత దశాబ్దాల పాటు ప్రజలకు ఉపయోగపడాలంటే ఇప్పటి పనుల్లో అత్యంత జాగ్రత్త అవసరం.

గడువు కంటే లక్ష్యం.. ప్రజలకు ప్రయోజనం ముఖ్యం : 2027 మే నాటికి తొలి దశ పనులు సిద్ధం చేయాలన్న లక్ష్యం ఆశాజనకమే. అయితే ప్రకటించిన గడువును చేరుకోవడానికి ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలి. నిర్మాణ పనులు, కాలువల అనుసంధానం, భూసేకరణ, పునరావాసం, సాంకేతిక అనుమతులు అన్నీ సమాంతరంగా పూర్తికావాలి. కేవలం నిర్మాణం పూర్తయిందని ప్రకటించడం కాకుండా, ప్రాజెక్టు ద్వారా ఆశించిన ప్రయోజనాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అన్నదే అసలు విజయానికి కొలమానం కావాలి.

పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు ఒక భారీ ఆస్తి. ఇది పూర్తయితే వ్యవసాయ రంగానికి భరోసా, తాగునీటి సమస్యలకు పరిష్కారం, పారిశ్రామికాభివృద్ధికి ఊతం, విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కలుగుతాయి. 960 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రం కూడా ప్రాజెక్టులో భాగంగా ఉంది. అయితే ఈ ప్రయోజనాలన్నీ సమర్థవంతమైన నిర్వహణ, ప్రణాళికాబద్ధమైన జలాల పంపిణీతోనే సాధ్యమవుతాయి.

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పోలవరం కలను సాకారం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అన్ని పక్షాలు సహకరించాలి. కేంద్రం నిధులు, రాష్ట్రం కార్యాచరణ, అధికారుల పర్యవేక్షణ, ఇంజినీర్ల నైపుణ్యం, క్షేత్రస్థాయి సిబ్బంది కృషి సమన్వయంతో సాగాలి. అన్నింటికంటే నిర్వాసితులకు న్యాయం జరగాలి.

గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోకుండా రైతుల పొలాలకు చేరినప్పుడే పోలవరం ప్రాజెక్టు అసలు లక్ష్యం నెరవేరుతుంది. 2027 మే లక్ష్యం మరో ప్రకటనగా మిగిలిపోకుండా కార్యరూపం దాల్చాలి. పోలవరం పూర్తి కావడం అంటే ఒక ఆనకట్ట నిర్మాణం ముగియడం మాత్రమే కాదు.. ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి కొత్త ఆశలు, గ్రామీణ ప్రాంతాలకు అభివృద్ధి, రాష్ట్ర భవిష్యత్తుకు జల భద్రత కల్పించడం. అదే పోలవరం ప్రాజెక్టు నిజమైన విజయంగా నిలుస్తుంది.

కంచంలో బియ్యం.. జేబులో చిల్లు !

- సూపర్ మార్కెట్లలో కిలో రూ.120.. ధరల పెరుగుదలతో సామాన్యుడికి కష్టాలు


మనిషి జీవనానికి ఆహారం ప్రాథమిక అవసరం. ఆహారంలోనూ తెలుగు రాష్ట్రాల ప్రజలకు బియ్యంతో విడదీయలేని అనుబంధం ఉంది. పేదవాడి గుడిసె నుంచి సంపన్నుడి భవనం వరకు ప్రతి ఇంట్లోనూ నిత్యం వినియోగించే ప్రధాన ఆహార ధాన్యం బియ్యం. కష్టపడి సంపాదించిన ఆదాయంలో గణనీయమైన భాగం కుటుంబ ఆహార అవసరాలకే ఖర్చవుతుంది. అలాంటి నిత్యావసర వస్తువు ధరలు సామాన్యుడి అందుబాటుకు దూరమైతే కుటుంబ బడ్జెట్ మొత్తం తలకిందులవుతుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో బియ్యం ధరలు పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు కిలో రూ.40 నుంచి రూ.50 మధ్య లభించిన సాధారణ బియ్యం ధర కూడా ఇప్పుడు రూ.60 దాటుతుండగా, సూపర్ మార్కెట్లలో నాణ్యమైన బియ్యం పేరుతో కిలోకు రూ.100 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ధరల గణాంకాలు ఒకలా ఉంటే, మార్కెట్‌లో వినియోగదారుడు చెల్లిస్తున్న ధర మరోలా ఉండటం ధరల నియంత్రణ వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

నెలనెలా పెరుగుతున్న ధరలు.. సామాన్యుడికి తప్పని తిప్పలు : బియ్యం ధరల పెరుగుదల ఒక్కరోజులో వచ్చిన పరిణామం కాదు. గత ఆగస్టు నుంచి సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. ప్రజాశక్తి కథనం ప్రకారం రాష్ట్ర సగటు ధరల్లో కిలో సూపర్ ఫైన్ బియ్యం ధర ఆగస్టులో రూ.65.95 ఉండగా, సెప్టెంబర్‌లో రూ.68.38కు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో రూ.59.85గా ఉన్న ధరతో పోలిస్తే సుమారు 15 శాతం పెరుగుదల నమోదైంది. ఫైన్ రకం బియ్యం ధర ఆగస్టులో రూ.58.65 ఉండగా, సెప్టెంబర్‌లో రూ.60.80కు, అక్టోబర్‌లో రూ.74కు చేరింది. సాధారణ రకం బియ్యం ధర కూడా ఆగస్టులో రూ.47.89 నుంచి సెప్టెంబర్‌లో రూ.49.83కు, అక్టోబర్‌లో రూ.56కు పెరిగి, ప్రస్తుతం రూ.60 దాటినట్లు నివేదిక పేర్కొంది.

ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కావు. నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు సంపాదించే కుటుంబాలకు ఈ ధరల పెరుగుదల ఎంతటి భారాన్ని మోపుతుందో అర్థం చేసుకోవచ్చు. కుటుంబంలో నలుగురు లేదా ఐదుగురు సభ్యులుంటే నెలకు కనీసం 20 నుంచి 25 కిలోల బియ్యం అవసరమవుతుంది. కిలోకు రూ.10 పెరిగినా నెలకు అదనంగా రూ.200 నుంచి రూ.250 భారం పడుతుంది. కూరగాయలు, పప్పులు, వంటనూనెలు, పాలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో బియ్యం ధరల పెరుగుదల కుటుంబ ఆర్థిక పరిస్థితిని మరింత కుంగదీస్తుంది.

సూపర్ మార్కెట్లలో ధరల దోపిడీకి అడ్డుకట్టేదీ? : ప్రస్తుతం బియ్యం విక్రయాల్లో మరో ఆందోళనకరమైన పరిణామం సూపర్ మార్కెట్లు, మాల్స్‌లో కనిపిస్తోంది. నాణ్యత, బ్రాండ్, సేంద్రీయ సాగు వంటి పేర్లతో ఒకే రకమైన బియ్యానికి ప్రాంతాన్ని బట్టి, విక్రయ కేంద్రాన్ని బట్టి భారీ ధరలు నిర్ణయిస్తున్నారు. కొన్ని చోట్ల కిలో బియ్యం రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. సేంద్రీయ బియ్యం పేరుతోనూ అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు పేర్కొంది.

నాణ్యమైన బియ్యం కొనుగోలు చేయాలన్న వినియోగదారుల అభిరుచిని వ్యాపార అవకాశంగా మలుచుకోవడంలో తప్పులేదు. అయితే ఉత్పత్తి నాణ్యత, సాగు విధానం, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ వంటి అంశాలకు అనుగుణంగా ధరలు ఉండాలి. కేవలం ఆకర్షణీయమైన ప్యాకింగ్, బ్రాండ్ పేరు, సేంద్రీయమనే ముద్రతో అధిక ధరలు వసూలు చేస్తే



వినియోగదారులు నష్టపోతారు. బియ్యం ప్యాకెట్లపై ఉత్పత్తి వివరాలు, రకం, బరువు, గరిష్ఠ చిల్లర ధర, ప్యాకింగ్ తేదీ వంటి వివరాలు స్పష్టంగా ఉండాలి. ధరల నిర్ణయంలో పారదర్శకత ఉండాలి. వినియోగదారుల వ్యవహారాల శాఖ, తూనికలు-కొలతల శాఖ అధికారులు మార్కెట్‌పై నిఘా పెంచాలి.

ఎల్‌నినో ప్రభావమా.. నిల్వల కృత్రిమ కొరతా? : బియ్యం ధరల పెరుగుదలకు వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, పంట దిగుబడులపై ఆందోళనలు ఒక కారణమని చర్చ జరుగుతోంది. అయితే ధరల పెరుగుదలకు ఎల్‌నినో ఒక్కటే కారణమని చెప్పలేం. వాస్తవంగా ఎంత పంట దిగుబడి వచ్చింది? మార్కెట్‌లో ఎంత బియ్యం అందుబాటులో ఉంది? గోదాముల్లో నిల్వలు ఎంత ఉన్నాయి? వ్యాపారుల వద్ద ఉన్న నిల్వలు ఎంత? దిగుమతులు, ఎగుమతుల ప్రభావం ఏమిటి? అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలి.

బియ్యం ధరలు పెరుగుతాయని ముందస్తుగా అంచనా వేసి కొందరు పెద్ద వ్యాపారులు భారీగా నిల్వలు ఉంచుతున్నారా? మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అన్న అనుమానాలను కూడా అధికారులు పరిశీలించాలి. చిన్న వ్యాపారులు పెద్ద వ్యాపారుల నిల్వలు, మార్కెట్‌పై వారి ఆధిపత్యం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్న నేపథ్యంలో ఈ ఆరోపణల్లో వాస్తవాలను వెలికితీయాలి. నిల్వల పరిమితులు, స్టాక్ వివరాలు, మార్కెట్ ధరలపై నిరంతర పర్యవేక్షణ అవసరం.

రేషన్ బియ్యం అక్రమ మళ్లింపుపై కఠిన నిఘా అవసరం : ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం పేదల ఆకలి తీర్చడానికే ఉద్దేశించినది. ప్రజాధనంతో కొనుగోలు చేసి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న ఈ బియ్యం అక్రమంగా ఇతర మార్గాలకు మళ్లితే అసలు లక్ష్యం దెబ్బతింటుంది. రేషన్ బియ్యాన్ని కిలో రూ.15 నుంచి రూ.20 చొప్పున సేకరించి, మిల్లుల్లో పాలిష్ చేసి, తెల్లగా మెరిసేలా మార్చి కిలో రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఇతర రకాల బియ్యాన్ని కలిపి రంగురంగుల ప్యాకెట్లలో ప్యాక్ చేసి కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ ఆరోపణలు నిజమైతే ప్రజాపంపిణీ వ్యవస్థలోని లోపాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది. పేదలకు అందాల్సిన బియ్యం అక్రమ వ్యాపారుల చేతుల్లోకి ఎలా వెళ్తోంది? సేకరణ నుంచి మిల్లింగ్, ప్యాకింగ్, మార్కెట్ విక్రయాల వరకు ఏయే దశల్లో అక్రమాలు జరుగుతున్నాయి? వాటి వెనుక ఎవరున్నారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలి. రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలు, మళ్లింపును అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలి.

అదే సమయంలో రేషన్ బియ్యం వినియోగదారుల అవసరాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. నాణ్యత మెరుగుపరచడం, సరఫరాలో పారదర్శకత, పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి.

తక్కువ ధర పేరుతో నాసిరకం బియ్యం విక్రయాలా? : ధరల పెరుగుదల నేపథ్యంలో ప్రభుత్వం తక్కువ ధరకు బియ్యం అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నించడం స్వాగతించదగినదే. అయితే తక్కువ ధరకు లభించే బియ్యం నాణ్యత విషయంలో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు కథనం పేర్కొంది. కిలో రూ.47కే విక్రయించాలని అధికారులు సూచిస్తున్నప్పటికీ, మిల్లర్ల నుంచి నాసిరకం బియ్యం సరఫరా అవుతోందని రిటైల్ వ్యాపారులు వాపోతున్నారు.

ఇక్కడ ప్రభుత్వం గుర్తించాల్సిన విషయం ఏమిటంటే.. ధర తగ్గించడం ఒక్కటే వినియోగదారులకు మేలు చేసినట్లు కాదు. తినడానికి అనువుగా లేని, నాణ్యత లేని బియ్యాన్ని తక్కువ ధరకు అందిస్తే ప్రజలు దానిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపరు. నాణ్యతతో కూడిన బియ్యం సరసమైన ధరకు లభించేలా చర్యలు తీసుకోవాలి. మిల్లర్ల నుంచి బియ్యం సేకరించే సమయంలోనే నాణ్యతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలి. నాణ్యత పరీక్షల అనంతరం మాత్రమే మార్కెట్‌లో విక్రయాలకు అనుమతించాలి.

రైతుకు గిట్టుబాటు.. వినియోగదారుడికి అందుబాటు ధర : బియ్యం ధరల చర్చలో రైతుల ప్రయోజనాలను కూడా విస్మరించకూడదు. వినియోగదారుడికి తక్కువ ధరకు బియ్యం అందించాలనే లక్ష్యంతో రైతుకు న్యాయమైన ధర దక్కకుండా చేయడం సరైన విధానం కాదు. సాగు ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీ ఖర్చులు, విద్యుత్, నీటి వ్యయం అన్నీ పెరిగిన నేపథ్యంలో రైతుకు గిట్టుబాటు ధర లభించాలి. అదే సమయంలో వినియోగదారుడికి భరించలేని ధరలు ఉండకూడదు.

ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ధాన్యం సేకరణ వ్యవస్థను బలోపేతం చేయడం, గోదాముల సామర్థ్యాన్ని పెంచడం, నిల్వల నిర్వహణను మెరుగుపరచడం, మిల్లింగ్ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించడం ద్వారా మార్కెట్‌లో అనవసర ధరల ఒడిదుడుకులను నియంత్రించవచ్చు. రైతు పండించిన ధాన్యానికి సరైన ధర దక్కాలి. వినియోగదారుడికి నాణ్యమైన బియ్యం సరసమైన ధరకు అందాలి. ఈ రెండూ పరస్పర విరుద్ధ లక్ష్యాలు కావు.

ధరల నియంత్రణలో ప్రభుత్వ యంత్రాంగం చురుగ్గా ఉండాలి : బియ్యం వంటి నిత్యావసర వస్తువు ధరలు పెరుగుతున్నప్పుడు ప్రభుత్వం కేవలం సమీక్షా సమావేశాలకే పరిమితం కాకూడదు. మార్కెట్‌లో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలి. రాష్ట్రంలోని ప్రధాన బియ్యం మార్కెట్లు, మిల్లులు, గోదాములు, హోల్‌సేల్ వ్యాపార కేంద్రాలు, సూపర్ మార్కెట్లలో తనిఖీలు నిర్వహించాలి.

ప్రభుత్వ ధరలు, హోల్‌సేల్ ధరలు, రిటైల్ ధరల మధ్య వ్యత్యాసాన్ని ప్రతిరోజూ పర్యవేక్షించాలి. బియ్యం నిల్వలను కృత్రిమంగా తగ్గించి ధరలు పెంచుతున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై ఆధారాలతో విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన ఉంటే చర్యలు చేపట్టాలి. నాణ్యత పేరుతో వినియోగదారులను మోసం చేసే సంస్థలపై కూడా నిఘా అవసరం.

ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని సమర్థంగా నిర్వహించి, అవసరమైనప్పుడు మార్కెట్‌లో బియ్యం సరఫరాను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి. పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉండేలా ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలించాలి.

ఆకలి తీర్చే బియ్యం అందని ద్రాక్ష కాకూడదు : దేశంలో ఆహార భద్రత గురించి మాట్లాడుతున్న తరుణంలో సామాన్యుడికి నిత్యావసరమైన బియ్యం ధరలు అందుబాటులో లేకపోవడం ఆందోళనకరం. ఒకవైపు రైతు పంట పండించేందుకు శ్రమిస్తుంటే, మరోవైపు వినియోగదారుడు బియ్యం కొనుగోలు చేసేందుకు అధిక మొత్తం వెచ్చించాల్సి వస్తోంది. ఈ రెండు వర్గాల మధ్య ఉన్న మార్కెట్ వ్యవస్థలో ఎక్కడ లోపాలున్నాయో గుర్తించాల్సిన అవసరం ఉంది. ధరల పెరుగుదలకు సహజ కారణాలు ఉంటే వాటిని అధిగమించే విధంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించాలి. కృత్రిమ కొరత, అక్రమ నిల్వలు, రేషన్ బియ్యం మళ్లింపు, నాణ్యత లేని సరఫరా వంటి సమస్యలు ఉంటే వాటిని కఠినంగా అరికట్టాలి. సూపర్ మార్కెట్ల నుంచి చిన్న కిరాణా దుకాణాల వరకు ధరల పారదర్శకత ఉండాలి. రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి సరసమైన ధర అనే రెండు లక్ష్యాలను సమన్వయం చేయాలి.

బియ్యం కేవలం ఒక వాణిజ్య వస్తువు కాదు.. కోట్లాది కుటుంబాల నిత్యావసరం. ఆకలి తీర్చే ఆహారం ధరల భారంతో సామాన్యుడికి దూరం కాకూడదు. మార్కెట్‌పై ప్రభుత్వ పర్యవేక్షణ పెరగాలి. అక్రమాలకు అడ్డుకట్ట పడాలి. నాణ్యతకు భరోసా కల్పించాలి. రైతు, వినియోగదారుడు ఇద్దరికీ న్యాయం జరిగే విధానమే ప్రజాపాలనకు అసలైన పరీక్ష. బియ్యం ధరలు అదుపులోకి వచ్చి ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన ఆహారం అందుబాటులో ఉన్నప్పుడే ఆహార భద్రత లక్ష్యం నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.

సీఎం రేవంత్ రెడ్డి తీరుతోనే ఏపీ జలదోపిడీ

- చంద్రబాబుకు గురుదక్షిణగా మన నీళ్లను అప్పగిస్తున్నరు
- నాగార్జున సాగర్ పై ఏపీ అక్రమ ప్రాజెక్టును వారం రోజుల్లోగా నిలిపి వేయించాలి
- లేదంటే వేలాది మందితో సాగర్ డ్యామ్‌ను ముట్టడిస్తాం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీరుతోనే ఏపీ జలదోపిడీకి పాల్పడుతోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. శనివారం ఈమేరకు వీడియో సందేశం రిలీజ్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబును పిలిచి ప్రజాభవన్ లో కాళ్లు కడిగి గురు దక్షిణగా మన నీళ్లను అప్పగించారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఆమోదంతోనే చంద్రబాబు పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపట్టారని తెలిపారు. రేవంత్ రెడ్డి అన్ని రకాల ప్రొటోకాల్స్‌ను విస్మరించి పని చేస్తున్నారని, ఫలితంగా రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జలవివాదాలపై అపెక్స్ కౌన్సిల్ సమావేశం కోసం డిమాండ్ చేయకుండా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో అన్ అఫీషియల్ మీటింగ్ కు వెళ్లి పోలవరం – బనకచర్లకు ఒప్పుకొని వచ్చారని తెలిపారు.రేవంత్ రెడ్డి అడ్డుకోలేదనే ధైర్యంతోనే ఏపీ ప్రభుత్వం తాగు నీటి పేరుతో నాగార్జున సాగర్ నీళ్లకు గండికొడుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు ఎంతటి జలదోపిడీకి పాల్పడ్డాయో తెలంగాణ ప్రజల కళ్ల ముందర ఉందన్నారు. తాగునీరు పేరుతో శ్రీశైలం ప్రాజెక్టుపై పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మించి ఇప్పుడు మొత్తం రిజర్వాయర్ నే మళ్లించుకునే స్థాయిలో పనులు చేసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు నాగార్జున సాగర్ పై ఏపీ కన్ను పడిందని.. ఇప్పటికే తాగునీటి కోసం 2.8 టీఎంసీలను తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ లిఫ్ట్ పేరుతో మరో 1.8 టీఎంసీలను తరలించేందుకు రంగం సిద్ధం చేశారని అన్నారు. తాగునీటి పేరు చెప్పి ప్రాజెక్టులు మొదలు పెట్టి మొత్తం రిజర్వాయర్ లోని నీటిని ఎత్తుకుపోవడం ఏపీ నైజం అన్న సంగతి మనందరికి తెలుసన్నారు. ఏపీ ప్రభుత్వం 9 నెలలుగా అక్రమ ప్రాజెక్టు నిర్మిస్తుంటే తెలంగాణ ప్రభుత్వానికి కనీస సమాచారం లేదు అనే వాదనను ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ఎక్కడ ఏం జరిగినా ఇంటెలిజెన్స్ ముఖ్యమంత్రిని అలర్ట్ చేస్తుందని.. దురదృష్టవశాత్తు రాష్ట్రం హోం శాఖ బాధ్యతలు కూడా చూస్తున్న రేవంత్ రెడ్డికి ఏపీ అక్రమ ప్రాజెక్టు గురించి తెలియక పోవడం అనేక సందేహాలకు తావిస్తోందన్నారు. నిజంగానే సమాచారం తెలియదా? తెలిసినా తన సమ్మతితోనే ప్రాజెక్టు చేపట్టింది కాబట్టి మౌనంగా ఉన్నారనే విషయంలో క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీకి తెలంగాణ ఓట్లు.. సీట్లు కావాలి తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవా అని ప్రశ్నించారు. అన్ని అంశాలపై స్పందించే ఎంపీ రఘునందన్ రావు, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఏపీ అక్రమ ప్రాజెక్టుపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఏపీలో బీజేపీకి బీడీపీతో పొత్తు ఉంది కాబట్టి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతారా అని నిలదీశారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు వెంటనే ప్రధాని వద్దకు వెళ్లి ఏపీ అక్రమ ప్రాజెక్టును నిలిపి వేయించాలని.. ఆ ప్రాజెక్టుకు కేంద్రం 50 శాతం నిధులు జల్ జీవన్ మిషన్ నుంచి ఇవ్వకుండా అడ్డుకోవాలని సూచించారు. ఏపీ అక్రమ ప్రాజెక్టును ఆపాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలదేనని స్పష్టం చేశారు. వారం రోజుల్లోగా ఏపీ అక్రమ ప్రాజెక్టును నిలిపి వేయించకుంటే వేలాది మంది ప్రజలతో నాగార్జున సాగర్ డ్యాంను ముట్టడిస్తామని.. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు.

సంబరాలకు సమయం ఉంది.. సమస్యలకు లేదా?

- ఈయూ, టీఎంయూ నేతలకు కార్మికుల సమస్యలు పట్టవా..?
- ఎన్నికలు ముగిసి 44 రోజులైనా సమస్యలకు పరిష్కారం ఏదీ?
- ఆర్టీసీ విలీనం, పీఆర్సీ, బకాయిలపై కార్యాచరణ ఎప్పుడు .?
- విజయోత్సవాలు సరే.. కార్మికులకు మీరిచ్చిన భరోసా ఏది?
- హామీలన్నీ ఓట్ల కోసమేనా?.. గెలిచాక బాధ్యత మరిచారా?



హైదరాబాద్, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : ఎన్నికలు ముగిశాయి.. యూనియన్లు గెలిచాయి.. నేతలు సంబరాలు చేసుకున్నారు.. విజయోత్సవాలు నిర్వహించుకున్నారు. కానీ తెలంగాణ ఆర్టీసీ కార్మికుల బతుకుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు.ఆర్టీసీ యూనియన్ ఎన్నికలు ముగిసి నేటికీ 44 రోజులు గడుస్తున్నా.. కార్మికుల సమస్యల పరిష్కారంలో మాత్రం ఆశించిన పురోగతి కనిపించడం లేదు. ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించిన ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) నాయకులు నేటికీ ఇంకా విజయోత్సవాల తాలూకు వేడుకల్లో మునిగితేలటం కార్మికుల్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది..ఎన్నికల సమయంలో కార్మికుల కష్టాలు గుర్తుకొచ్చిన నేతలకి నేడు వారి సంబరాలు మాత్రమే కనబడుతున్నాయట..ఎన్నికల సమయంలో కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యమంటూ హామీలు గుప్పించిన నేతలకు ..నేడు కార్మికుల బాధలు ..అరణ్య రోదనలుగా వినిపిస్తున్నాయట ..ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం నుంచి పీఆర్సీ అమలు వరకు, పెండింగ్ బకాయిల చెల్లింపుల నుంచి ఉద్యోగ భద్రత వరకు ఎన్నో అంశాలను ఎన్నికల ముందు ఈయూ, టీఎంయూ నేతలు ప్రస్తావించారు..కార్మికుల పక్షాన పోరాడతామని భరోసా ఇచ్చారు. ఆ మాటలు నమ్మిన కార్మికులు తమ ఓటుతో యూనియన్లకు పట్టం కట్టారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత పరిస్థితి మారిపోయిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంబరాలకు సమయం ఉంది.. సమస్యలకు లేదా?

గెలిచిన సంఘాల నేతలు పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ.. డిపోల చుట్టూ తిరుగుతూ విజయోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఒకరినొకరు సత్కరించుకుంటూ, గెలుపు సంబరాల్లో మునిగితేలుతున్నారు. కానీ అదే డిపోల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకునే నాయకులే కనిపించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం కార్మికుల వద్దకు వెళ్లి 'మీ సమస్యల పరిష్కారానికి మేమున్నాం.. మీకు అండగా నిలుస్తాం' అని భరోసా ఇచ్చే నాయకుడు కూడా కనిపించడం లేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల సమయంలో తమ చుట్టూ తిరిగిన నాయకులు.. ఇప్పుడు గెలిచిన తర్వాత తమ సమస్యల వైపు కన్నెత్తి చూడకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నాడు ఓట్ల కోసం కార్మికుల కష్టాలను ఏకరువు పెట్టిన నేతలు.. నేడు వారి కన్నీళ్లు తుడిచేందుకు ఎందుకు ముందుకు రావడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.నాయకులు గెలుపును ఆస్వాదించడంలో తప్పులేదు. కానీ ఆ గెలుపునకు కారణమైన కార్మికుల సమస్యలను విస్మరించడం ఎంతవరకు సమంజసం? కార్మికుల ఓట్లతో గెలిచిన నేతలు ముందుగా చేయాల్సింది విజయోత్సవాలా? లేక కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడమా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం ఈయూ, టీఎంయూలకు ఉందా?

దశాబ్దాలుగా ఆర్టీసీ కార్మికులు చేస్తున్న ప్రధాన డిమాండ్ ప్రభుత్వంలో సంస్థ విలీనం. ఎన్నికల సమయంలో ఈ అంశంపై హామీలు ఇచ్చిన సంఘాలు ఇప్పుడు ప్రభుత్వాన్ని ఎంతవరకు నిలదీస్తున్నాయి? విలీనంపై స్పష్టమైన హామీ తీసుకునేందుకు ప్రయత్నించాయా? ఆర్టీసీ యాజమాన్యాన్ని కలిసి కార్మికుల సమస్యలపై చర్చించాయా? కనీసం సమస్యల పరిష్కారానికి కాలపరిమితితో కూడిన కార్యాచరణ రూపొందించాయా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదన్న అసంతృప్తి కార్మికుల్లో వ్యక్తమవుతోంది.

పెండింగ్ సమస్యలపై పట్టింపు ఏది?

ఆర్టీసీ కార్మికుల సమస్యలు ఒక్కటిరెండు కాదు. పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏలు, బకాయిల చెల్లింపులు, ఈహెచ్ఎస్ అమలు, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు.. ఇలా ఎన్నో సమస్యలు.. పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. సంస్థ ఆర్థిక పరిస్థితి, కార్మికుల సంక్షేమం మధ్య సమతుల్యత సాధించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు యాజమాన్యంపైనా ఉంది. అదే సమయంలో కార్మికుల తరఫున పోరాడాల్సిన బాధ్యత గుర్తింపు పొందిన యూనియన్లపై కూడా ఉంది.ఎన్నికల్లో గెలవడం ఒక బాధ్యతను స్వీకరించడం మాత్రమే. ఆ బాధ్యతను ఎంత సమర్థంగా నిర్వర్తిస్తారన్నదే అసలైన పరీక్ష. కార్మికుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు జరిపి, యాజమాన్యాన్ని ఒప్పించి, పరిష్కార దిశగా అడుగులు వేస్తేనే యూనియన్ల విజయానికి సార్థకత ఉంటుంది. లేదంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మరోసారి నినాదాలుగానే మిగిలిపోతాయి.

కార్మికుల ఓట్లకు విలువ లేదా?

కార్మికులు తమ ఓటుతో యూనియన్లకు అధికారం మాత్రమే కాదు.. అంతకుమించిన బాధ్యతను కూడా అప్పగించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. నేతలు వ్యక్తిగత ప్రతిష్ఠ, సంఘాల ఆధిపత్యం, పరస్పర అభినందనలు, విజయోత్సవాలకే పరిమితమైతే కార్మికుల విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఎన్నికల్లో గెలిచిన సంఘాలు కార్మికుల గొంతుకగా నిలుస్తాయా? లేక గెలుపు సంబరాలకే పరిమితమవుతాయా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గెలుపు శాశ్వతం కాదు.. కార్మికుల విశ్వాసమే యూనియన్లకు అసలైన బలం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే మాటలు కాదు.. కార్యాచరణ ముఖ్యం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలి.

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. యాజమాన్యంతో చర్చలు జరపాలి. సమస్యల పరిష్కారానికి కాలపరిమితిని నిర్దేశించుకోవాలి. ఈయూ, టీఎంయూ నేతలారా.. విజయోత్సవాలు పక్కనపెట్టి కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి. మీరు ఇచ్చిన హామీలు మాటల్లో కాదు.. చేతల్లో చూపించండి ..

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు సాగుపై అవగాహన

- ప్రభుత్వ సబ్సిడీ పథకాలపైఅవగాహన పాలాల్లోనే ముఖాముఖి.
- రైతులతో ముఖాముఖి నిర్వహించిన జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎం.ఏ.సత్తార్



వికారాబాద్, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : ఎలినో ప్రభావంతో పంటల సాగులో రైతులు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎం. ఏ. సత్తార్ సూచించారు. ఎలినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరు పంటల సాగుకే ప్రాధాన్యత ఇవ్వాలని అని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం కేరెల్లి గ్రామంలో పొలాల్లోల రైతులతో ముఖాముఖి నిర్వహించి పంటల సాగు, వ్యవసాయ విధానాలు, ప్రస్తుత పరిస్థితులపై అవగాహన కల్పించారు. గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించిన ఆయన, ఆయా పంటల వివరాలు, సాగు విధానాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పంటల ప్రస్తుత పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టడంతో పాటు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాల గురించి రైతులకు వివరించారు. డ్రిప్ ఇరిగేషన్, సింగర్ పైపులు, మల్చింగ్ పేపర్ వంటి వ్యవసాయ పరికరాలు, సామగ్రిపై అందించే సబ్సిడీ వివరాలను చేశారు, ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవడంతో పాటు పంటల ఉత్పత్తి, నాణ్యత పెంపొందించుకోవచ్చని వివరించారు.అదేవిధంగా రైతులకు అవసరమైన నారు, విత్తనాలు అవసరం ఉన్న రైతులు ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. నారు అవసరమైన రైతులు కనీసం 35 రోజుల ముందుగా ఉద్యానవన శాఖలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సమయానికి దరఖాస్తు చేసుకుంటే అవసరమైన నారు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు.రైతులతో నేరుగా పొలాల్లో ముఖాముఖి నిర్వహించడం ద్వారా సాగు సమస్యలను తెలుసుకుని, వాటికి తగిన సూచనలు అందించడమే లక్ష్యమని ఉద్యానవన శాఖ అధికారి తెలిపారు. ఈ రైతు అవగాహన కార్యక్రమంలో సంగారెడ్డి, దయాకర్ రెడ్డి, మల్ రెడ్డి, గోపాల్ ముదిరాజ్,వెంకట్రామ్ రెడ్డి , నరసింహులు, శ్రీనివాస్ ముదిరాజ్, జహంగీర్, నాగరాజు, వెంకట్ రెడ్డి, యాదవ రెడ్డి, రామ కృష్ణారెడ్డి, గ్రామ రైతులు యువ రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించడం ఎంతో మేలు

గ్రామ రైతులు మాట్లాడుతూ.

గతంలో ఉద్యానవన శాఖ అధికారులు గ్రామాలకు వచ్చి రైతులకు అవగాహన కల్పించడం చాలా అరుదు. గత రెండేళ్లుగా అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ సబ్సిడీలు, పథకాల గురించి వివరించడంతో పాటు పంటల సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని, క్షేత్రస్థాయిలో రైతులకు మార్గదర్శకత్వం అందిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.ఈ రైతు అవగాహన కార్యక్రమంలో సంగారెడ్డి, దయాకర్ రెడ్డి, మల్ రెడ్డి, గోపాల్ ముదిరాజ్, వెంకట్రామ్ రెడ్డి , నరసింహులు, శ్రీనివాస్ ముదిరాజ్, జహంగీర్, నాగరాజు, వెంకట్ రెడ్డి, యాదవ రెడ్డి, రామకృష్ణారెడ్డి, గ్రామ రైతులు యువ రైతులు పాల్గొన్నారు.

నాకాబందీతో అక్రమాలకు చెక్. వాహనదారులకు పోలీసుల హెచ్చరిక

- జిల్లావ్యాప్తంగా పోలీసుల నాకాబందీ 1,287 వాహనాల తనిఖీ.
- నిబంధనలు బేఖాతరు చేస్తే చర్యలు తప్పవు ఎస్పీ స్నేహ మెహ్రా హెచ్చరిక.



వికారాబాద్, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు నాకాబందీ, ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రధాన రహదారులు, కూడళ్లు, కీలక ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేసి అనుమానితులపై నిఘా పెట్టారు. ఈ తనిఖీల్లో మొత్తం 1,287 వాహనాలను పరిశీలించగా, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 120 ఈ-పెట్టీ కేసులు, 83 డీడీ కేసులు నమోదు చేసి, 272 ఈ-చలాన్లు జారీ చేశారు. మొత్తం రూ.98,730 జరిమానా విధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు. సీట్‌బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రత కోసం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించి సురక్షిత వికారాబాద్ జిల్లాకు భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

కడ్తాల్‌లో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్



కడ్తాల్, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని, సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రం లోని పీఎంశ్రీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మండలంలోని 10 పాఠశాలలకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ పరీక్షలో ప్రగతి హైస్కూల్‌కు చెందిన వశీకర్, అరవింద్, రామ్‌చరణ్ మండల స్థాయిలో విజేతలుగా నిలిచారు.విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటేష్,ఎక్వాయిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీను,ఉపాధ్యాయులు సతీష్,శ్వేత మధురి తదితరులు పాల్గొన్నారు.

నార్లకుంట తండాలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం

- సర్పంచ్ రామచందర్ నాయక్



కడ్తాల్, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం నార్లకుంట తండా గ్రామపంచాయతీ పరిధిలో శనివారం ప్రారంభించారు.గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామచందర్ నాయక్,ఉప సర్పంచ్ రవీందర్ నాయక్,పంచాయతీ కార్యదర్శి రమేష్ నాయక్,వార్డు సభ్యులు శ్రీను నాయక్,సుజాత,లక్ష్మి,పాండు నాయక్,పావని తదితరులు పాల్గొని పథకాన్ని ప్రారంభించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రజలకు సామాజిక భద్రత కల్పించడంలో దోహదపడుతుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్,ఎంపీటీసీ హన్యా నాయక్,మాజీ సర్పంచ్ పూజ దేవా నాయక్,మాజీ ఉప సర్పంచ్ రాములు నాయక్,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రమేష్ నాయక్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు హరి నాయక్,నేనావత్ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజ్‌గిరి, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : మౌలాలి డివిజన్ పరిధిలోని సఫిల్‌గూడ పీబీ సూర్యనగర్ కాలనీలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారి పడిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్ప స్వామి భక్తులతో కలిసి పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్వామివారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జె.ఎ.సి. వెంకన్న, మేకల రాము యాదవ్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, వంశీ ముదిరాజ్, ఉస్మాన్, నవాబ్, దినేష్, మారుతి ప్రసాద్, విజయ్ రెడ్డి, అద్విత్ రెడ్డి, బాల తదితర బీఆర్ఎస్ నాయకులు, అయ్యప్ప స్వామి భక్తులు, స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తుల చింతలు దూరం చేసే శ్రీవారికి..
100 కిలోల చింతకాయలతో అద్భుత అలంకరణ

- ఆనంద్ బాగ్‌లో కనువిందు చేసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి విశేష అలంకరణ



మల్కాజిగిరి, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : భక్తుల చింతలను దూరం చేసే కలియుగ దైవం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారికి 100 కిలోల చింతకాయలతో నిర్వహించిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మల్కాజిగిరిలోని ఆనంద్ బాగ్‌లో కొలువైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ విశేష అలంకరణను చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకట రమణా చార్యులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని చింతకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల చింతలను దూరం చేసే శ్రీవారికి భక్తులు, సేవకుల సహకారంతో వంద కిలోల చింతకాయలతో అలంకరణ చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. స్వామివారికి ఇలాంటి విశేష సేవలో భాగస్వాములు కావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. చింతకాయలను ఆలయం అంతటా అందంగా పేర్చి, పసుపు, తెలుపు, గులాబీ రంగుల పూలమాలలు, సంప్రదాయ ఆభరణాలు, పట్టువస్త్రాలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చింతకాయలతో రూపొందించిన ఈ వినూత్న అలంకరణలో స్వామివారి దివ్యమంగళ రూపం భక్తులకు కనులవిందు చేసింది. ఈ ప్రత్యేక అలంకరణను దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంతో స్వామివారిని దర్శించుకుని గోవింద నామస్మరణ చేశారు. భక్తుల చింతలను తొలగించే స్వామివారికి చింతకాయలతో అలంకరణ చేయడం ఆధ్యాత్మికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఇందిరమ్మ కుటుంబ బీమాలో నమోదు చేసుకోవాలి

- కమిషనర్ మంగతాయారు
- మెట్టుగూడ సర్కిల్ పరిధిలో ఆరు నమోదు శిబిరాలు ఏర్పాటు



సికింద్రాబాద్, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమం మెట్టుగూడ సర్కిల్ నం.44 పరిధిలో ఆరు కేంద్రాలను నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన నమోదు శిబిరాలను శనివారం నాడు జోనల్ కమిషనర్ కె.ఎ.మంగతాయారు,సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎం.ఎన్.ఆర్. జ్యోతి సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా శిబిరాల్లో జరుగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించిన అధికారులు,లబ్ధిదారులతో మాట్లాడి పథకం ఉద్దేశాలు,ప్రయోజనాలను వివరించారు.అర్హులైన కుటుంబాలు ఈ పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.మెట్టుగూడ సర్కిల్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా మొత్తం ఆరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.నమోదు సమయంలో తెల్ల రేషన్ కార్డు,ఆధార్ కార్డు,నామినీ వివరాలను తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జోనల్ కమిషనర్ సూచించారు.ప్రజలు తమకు సమీపంలోని నమోదు శిబిరాలను సందర్శించి అవసరమైన పత్రాలతో నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పిలుపు

హుస్నాబాద్, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :

ఈ నెల 23న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.మహా పాదయాత్ర నేపథ్యంలో శనివారం హుస్నాబాద్ పట్టణంలోని బి.ఎల్. రెడ్డి ఫంక్షన్ హాల్‌లో బీజేపీ హుస్నాబాద్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. మహా పాదయాత్ర ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్తకు బాధ్యతలు అప్పగించి పాదయాత్రకు ప్రజల మద్దతు కూడగట్టాలని కోరారు.ఈ సమావేశంలో మండల ప్రభారి తోట స్వరూప, మాజీ అధ్యక్షుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెల్దండి రాజేంద్రప్రసాద్, మాజీ అధ్యక్షుడు చెక్కబండి విద్యాసాగర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లి శ్రీనివాస్, జిల్లా ఓబీసీ మాజీ అధ్యక్షుడు బొమ్మగాని సతీష్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శులు రత్నాకర్ రెడ్డి, బైరి అరుణ్, మహిళా జిల్లా కార్యవర్గ సభ్యురాలు చిన్మయి, ఓబీసీ



మండల అధ్యక్షుడు పూదరి కిష్టయ్య, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మంద మహేశ్వర్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు సాళ్ళ రజనీకాంత్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కండె శంకర్, మండల ఉపాధ్యక్షులు కుంట మల్లయ్య, భూతగడ్డపు బాలరాజు, బత్తుల శ్రీనివాస్, మండల కార్యదర్శి నార్లపురం సత్యం సీనియర్ నాయకులు బొమ్మగాని జగన్నాథం, వెల్దండి సత్యనారాయణ, నెల్లి శ్రీనివాస్, జంగ వెంకట్ రెడ్డి, బూత్ అధ్యక్షులు బొల్లి సుధాకర్, భాష, బత్తిని మధు, గుజ్జుల బాలరాజు, పోలవేణి సందీప్, గీకురు సంతోష్, గుండాల ప్రశాంత్, శ్రీనివాస్ రెడ్డి, బొమ్మగాని ఈశ్వర్, పుట్ట కొమురయ్య, మెరుగు రవీందర్, కనకట్ల కిషన్, సాల్లు నాగార్జున, భక్తుల నాగార్జున, మీదిని కొమరయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్ పై విష ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యంగా ఈ నెల 23 వ తేదీన కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మహా పాదయాత్రను

హుస్నాబాద్, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :

విజయవంతం చేయాలని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్లపల్లి వీరాచారి పిలుపునిచ్చారు. ఈ మేరకు కేంద్రమంత్రి బండి సంజయ్ ని ఆయన నివాసంలో కలిసి మహా పాదయాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. దేశ సమగ్రతను, ప్రజాస్వామ్యాన్ని ఇండికూటమి, కాక్రోచ్ జనతా పార్టీలు దెబ్బతీయాలనే ప్రయత్నం చేస్తున్నాయని వీరాచారి ఆరోపించారు. సర్ పై విష ప్రచారాన్ని తిప్పి కొట్టి, ప్రజాస్వామ్య పరిరక్షణకు బిజెపి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 40 పార్లమెంట్ సెగ్మెంట్ లలో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నరన్నారు. అందులో భాగంగా ఈ నెల 23న కరీంనగర్ లో లక్ష మందితో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రి బండి సంజయ్ మహా పాదయాత్ర నిర్వహించనున్నారని వెల్లడించారు. ఈ పాదయాత్రలో



హుస్నాబాద్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు..!

- హుస్నాబాద్ ప్రాంత కబడ్డీ క్రీడాకారులకు ఘన సన్మానం..!

హుస్నాబాద్, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :

హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన కబడ్డీ క్రీడాకారులు ఉమ్మడి మెదక్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న సందర్భంగా వారిని హుస్నాబాద్ ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించడం జరిగింది.కబడ్డీ క్రీడలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ఎంపికై, ఉమ్మడి మెదక్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు హుస్నాబాద్ ప్రాంతానికి గర్వ కారణమని ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఇంతటి స్థాయికి ఎదగడం వెనుక వారి క్రమశిక్షణ, కఠోర సాధన, వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఉందని కొనియాడారు.క్రీడాకారులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. రాబోయే పోటీల్లో మరింత మెరుగైన ప్రదర్శన కనబరచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల వల్ల శారీరక, మానసిక దృఢత్వంతో పాటు జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు



అలవడతాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సెంట్ జోసెఫ్ ప్రిన్సిపాల్ విజయేంద్ర రెడ్డి, ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అరవింద్, సెక్రటరీ రాజారెడ్డి, ట్రెజరర్ సంపత్, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్ మరియు ఈసీ మెంబర్లు అజయ్, స్రవంతి, కవిత, మాధవి, లావణ్య, కళావతి పాల్గొన్నారు.

యువ నాయకుడు పి. సందీప్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనం

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నాయకులు, అభిమానులు
- సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్ష

తలకొండపల్లి, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :

తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) యువ నాయకుడు పి. సందీప్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు, యువజన నాయకులు,అభిమానులు అత్యంత ఉత్సాహంగా,ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వేడుకలకు హాజరైన నాయకులు, మిత్రుల సమక్షంలో సందీప్ కుమార్ యాదవ్ కేక్ కట్ చేశారు.అనంతరం నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి సందీప్ కుమార్ యాదవ్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని,



నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. తనపై అభిమానంతో వేడుకలు నిర్వహించిన నాయకులకు, మిత్రులకు సందీప్ కుమార్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు తిరుపతి రాఘవేందర్ గౌడ్, నాయకులు ఆయిల్ శ్రీశైలం గౌడ్, రిపోర్టర్ విజయ్ యాదవ్, వడ్డె సాయి,యాదగిరి,శివ,మురళిహరీష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేసిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : మహేశ్వరం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలోని కాకి ఈశ్వర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో నూతనంగా మంజూరైన పెన్షన్ల ప్రొసీడింగ్ కాపీలను లబ్ధిదారులకు మంత్రి సీతక్క గారు, మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారు అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఇతర ప్రముఖులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





కల్వకోల్ గ్రామస్తులకు మహేశ్వరంలో నూతన పింఛన్ల పంపిణీ చేసిన సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ



మహేశ్వరం, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో కాకీశ్వర్ ఫంక్షన్ హాల్ లో చేయూత పెన్షన్ ల పంపిణీ కార్యక్రమనికీ ముఖ్యఅతిథిగా రాష్ట్ర పంచాయతీ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క మరియు స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి , పాల్గొన్నారు చేయూత పింఛన్ సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ విలేజ్ సెక్రటరీ వేణు పాల్గొని గ్రామంలో ఉన్న 17 మంది లబ్ధిదారులు వారిలో ఐదు మంది వికలాంగులు ఒకరు ఒంటరి మహిళ 11 మంది వితాంతులకి గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా సర్టిఫికెట్ పంపిణీ చేయడం జరిగింది.

ముదిరాజుల ఐక్యతతోనే సంఘం అభివృద్ధి



శామీర్‌పేట, నవంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : ముదిరాజ్ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉమ్మడి శామీర్‌పేట్ మండలంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి శామీర్‌పేట్ మండల మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, కమిటీ సభ్యుడు కరకపట్ల రాము ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముదిరాజులంతా ఐక్యంగా ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంఘం ఆశయాలు, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఐక్యతతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోయిన శంకర్, వల్ల లక్ష్మీనారాయణ, కట్టెల రవీందర్, వల్ల రాంచందర్, వెంకట్, స్వామి, రాజు, హరిబాబు, సోమరాజు, శ్రీను, ఆంజనేయులు, కరకపట్ల వనజ, మైనబోయిన నాగరాణి, వల్లప్ప, స్వరూప, రాణి, లోకేశ్వరి, స్వర్ణలత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టండి



- అభివృద్ధిలో భాగస్వాములు కండి.. మంత్రి కందుల దుర్గేష్ పిలుపు
- మంగళవారపుపేట, ధవళేశ్వరంలో విస్తృత ప్రచారం

రాజమహేంద్రవరం, నవంబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్): నగరసమగ్ర అభివృద్ధి వేగవంతం కావాలంటే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్రపర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల సమీకరణ సులభమై, వార్డుల అభివృద్ధి వేగంగా జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ నెల 26న జరగనున్న రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 30వ వార్డు జనసేన అభ్యర్థి అందనపల్లి సత్యనారాయణ, ధవళేశ్వరంలోని 20వ వార్డు జనసేన అభ్యర్థి యడ్ల అశ్విని మహేష్‌కు మద్దతుగా ఆదివారం మంత్రి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తొలుత మంగళవారపుపేటలో, అనంతరం ధవళేశ్వరంలోని పలు కాలనీల్లో ప్రచార రథంపై పర్యటిస్తూ ఓటర్లను అభ్యర్థించారు. మంత్రి పర్యటనతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొనగా, కార్యకర్తలు జై జనసేన, జై కూటమి నినాదాలతో హోరెత్తించారు.

మంగళవారపుపేటలోని గణపతి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధవళేశ్వరం ఎంప్లాయీస్ కాలనీ రెండో వీధి ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో స్థానికులు పూలు చల్లుతూ, మహిళలు మంగళహారతులతో మంత్రికి ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్థానిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ధవళేశ్వరంలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసమైన ఘటనను గుర్తుచేశారు.

దోషులను శిక్షించి, నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసే వరకు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టానని, అనేక అవాంతరాలు ఎదురైనా నాటి ప్రభుత్వం దిగివచ్చి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించేలా పోరాడానని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో పాటు రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, స్థానిక బీజేపీ నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రాంతాన్ని ఆదర్శవంతంగా, సుందరంగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థులకు సామాజిక సేవా దృక్పథం ఉందని, వారిని గెలిపిస్తే అభివృద్ధి పనులకు తన పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

నగరాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరుతూ మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవిని కమలం గుర్తుపై, 30వ వార్డు అభ్యర్థి అందనపల్లి సత్యనారాయణ, 20వ వార్డు అభ్యర్థి యడ్ల అశ్విని మహేష్‌లను గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

పలుగురాళ్ళపల్లె సర్పంచ్ అభ్యర్థిగా బసిరెడ్డి బాల దుగ్గిరెడ్డి నామినేషన్



- గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తా: బసిరెడ్డి బాల దుగ్గిరెడ్డి

బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): బ్రహ్మంగారిమఠం మండలం పలుగురాళ్ళపల్లె గ్రామపంచాయతీ తెలుగుదేశం సర్పంచ్ అభ్యర్థిగా బసిరెడ్డి బాల దుగ్గిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు గ్రంథాలయం, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కల్పిస్తానని పేర్కొన్నారు. అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటానన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు, వడ్డీలేని రుణాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వృద్ధులకు పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరయ్యేలా ప్రయత్నిస్తానన్నారు. గ్రామంలో చెరువులను నీటి తో నింపుదల, తాగునీటి సమస్య పరిష్కారం, రైతులకు సాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పెద్ద సంఖ్యలో తెలుగుదేశం నాయకులు మరియు కార్యకర్తలు,బంధు మిత్రులు పాల్గొన్నారు.

పులి కదలికలపై నిరంతర నిఘా.. ప్రజల భద్రతకు భరోసా

- థర్మల్ డ్రోన్లు, ఏఐ ఆధారిత కెమెరా ట్రాప్‌లతో నిఘా
- హనుమాన్ బృందాలతో విస్తృత పర్యవేక్షణ చేపట్టండి
- ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి
- అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేక రెస్క్యూ బృందాలను రప్పించండి
- రెవెన్యూ, పోలీస్, పశుసంవర్ధక శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లాలి
- పులికి ఎలాంటి హాని కలగకుండా సురక్షితంగా పట్టుకునేలా చర్యలు
- ఏ.కొండూరు అటవీ ప్రాంతంలో పులి సంచారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమీక్ష



ఏ.కొండూరు, నవంబరు 22(జర్నలిస్ట్ ఫైల్) : ఏ.కొండూరు పరిసరాల్లోని అటవీ ప్రాంతాల్లో తిరుగుతూ, ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్న పులిని సురక్షితంగా పట్టుకునేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పులి కదలికలపై నిరంతరం నిఘా పెడుతూ, ప్రజల భద్రత భరోసా ఇవ్వాలని పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి పులిని సురక్షితంగా పట్టుకునేందుకు అధునాతన సాంకేతికతతోపాటు ఇతర రాష్ట్రాల నిపుణుల సహకారం తీసుకోవాలని అటవీశాఖ ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ స్వీయ పర్యవేక్షణలో ఆపరేషన్ నిర్వహించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీ శాఖ ఉన్నతాధికారులతో ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించారు. పులి కదలికలు, దాని సంచార ప్రాంతాలు, ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

పులి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, పులి సంచార మార్గాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ సమాచారాన్ని పరిసర గ్రామాల ప్రజలకు చేరవేయాలి. స్థానిక అటవీ శాఖ బృందాలతో సమన్వయం చేసుకుంటూ హనుమాన్ బృందాలతో విస్తృతంగా గస్తీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పులి కదలికలను మరింత సమర్థవంతంగా గుర్తించేందుకు థర్మల్ డ్రోన్లు, ఏఐ ఆధారిత కెమెరా ట్రాప్‌లు, ఇతర ఆధునిక సాంకేతిక పరికరాలను విస్తృతంగా వినియోగించాలని ఉప ముఖ్యమంత్రివర్యులు పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌ను పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ , ఇతర అటవీ శాఖ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో చేపట్టే చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

పులి సంచరిస్తున్న ప్రాంతానికి సమీపంలోని గ్రామాల్లో ప్రజల భద్రతకు తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రైతులు, పశువుల కాపరులు, స్థానిక ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకుండా అవసరమైన సూచనలు చేయాలన్నారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేక పులి ట్రాకింగ్, రెస్క్యూ బృందాలను రప్పించి ఆపరేషన్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. వన్యప్రాణి సంరక్షణ నిబంధనలు, నిర్దేశిత ప్రోటోకాల్స్‌ను పాటిస్తూ, అనుభవజ్ఞులైన వన్యప్రాణి నిపుణుల సహకారంతో పులిని సురక్షితంగా పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఈ ఆపరేషన్‌లో ప్రజలకుగానీ, పులికిగానీ ఎలాంటి హాని కలగకూడదని ఉప ముఖ్యమంత్రివర్యులు స్పష్టం చేశారు. ప్రజల ప్రాణరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే, పులి సంరక్షణను కూడా బాధ్యతగా తీసుకుని జాగ్రత్తగా, సమన్వయంతో చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ, చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు.

పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు కలగకుండా అన్ని చర్యలను, అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని ఉప ముఖ్యమంత్రివర్యులు స్పష్టం చేశారు.

బాపట్ల ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నసీర్

- కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపు
- సీఎం చంద్రబాబు విజనరీ లీడర్
- కూటమికి మద్దతుతోనే మునిసిపాలిటీకి మహర్దశ



గుంటూరు, నవంబరు 22(జర్నలిస్ట్ ఫైల్) :బాపట్ల సముద్ర తీరాన ఉవ్వెత్తున ఎగసిపడే అలలకు పోటీ పడుతూ కూటమి అభ్యర్థులు ప్రజల్లో ఆదరణ పొందుతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం బాపట్ల మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో స్థానిక ఎంపీ కృష్ణప్రసాద్ తో కలిసి ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 15వ వార్డులో జనసేన కౌన్సిలర్ అభ్యర్థి నరాలశెట్టి మౌనిక, 18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి షేక్ షబ్బీర్ అహ్మద్ కు మద్దతుగా ఓటర్ల వద్దకు వెళ్లి కూటమి అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ విద్య వికాసానికి నిలయంగా ఉన్న బాపట్ల ఓటర్లు చైతన్యం కలిగి ఉంటారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో అన్ని రంగాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధోగతి పాలైన రాష్ట్రాన్నిఆర్థిక శక్తిగా మారుస్తున్నట్లు తెలిపారు. బాపట్ల పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే పురపాలక సంఘంలో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. గత పాలనలో నిర్లక్ష్యానికి గురైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యలను కూటమి అధికారంలోకి రాగానే యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి నేతలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, స్థానిక మునిసిపాలిటీలోనూ కూటమి కౌన్సిలర్లు, చైర్మన్ గెలిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధిక నిధులు రాబట్టుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు : జిల్లా పోలీసులు

- రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వారికి పోలీసుల కౌన్సెలింగ్



గుంటూరు, నవంబరు 22(జర్నలిస్ట్ ఫైల్): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు నేరాలకు స్వస్తి పలికి చట్టబద్ధమైన జీవనం సాగించాలని గుంటూరు జిల్లా పోలీసులు సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు.

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సంబంధిత స్టేషన్ హౌస్ అధికారులు రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని, ఇకపై ఎలాంటి నేరాలకు పాల్పడకుండా చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు.

కుటుంబ సభ్యుల భవిష్యత్తు, సమాజంలో వ్యక్తిగత గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని చెడు స్నేహాలు, అసాంఘిక కార్యకలాపాలు, నేరప్రవృత్తికి పూర్తిగా దూరంగా ఉండాలని హితవు పలికారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో అక్రమంగా జోక్యం చేసుకోవడం, ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడటం చేయరాదని హెచ్చరించారు.

ప్రజల ప్రశాంతతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు, నేరచరిత్రకలిగిన వ్యక్తులు, నేరప్రవృత్తి ఉన్నవారిపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని తెలిపారు.

ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అనుమానిత, సమస్యాత్మక వ్యక్తులపై బైండోవర్ ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. అదే సమయంలో నేరాలకు దూరంగా ఉంటూ సమాజంలో ప్రశాంతంగా, చట్టబద్ధంగా జీవించేవారికి పోలీసుల తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. నేరరహిత సమాజ నిర్మాణం, ప్రజలకు ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడమే గుంటూరు జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

- బుర్రిపాలెం, సిరిపురం, అత్తోటలో కవాతు
- ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి: జిల్లా పోలీసులు



గుంటూరు, నవంబరు 22(జర్నలిస్ట్ ఫైల్) : గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ఈ నెల 29న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన బుర్రిపాలెం, సిరిపురం, అత్తోట గ్రామాల్లో ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజల్లో భరోసా కల్పించడం, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టడం లక్ష్యంగా పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి.

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు తెనాలి సబ్ డివిజన్ పరిధిలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. తెనాలి రూరల్ మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో సాయంత్రం 5 నుంచి 5.30 గంటల వరకు సుమారు 100 మంది పోలీసు సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గత రెండు రోజులుగా గ్రామంలో చోటుచేసుకున్న సంఘటనల నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించి, శాంతిభద్రతల పరిరక్షణకు భరోసా కల్పించేలా కవాతు చేపట్టారు.

అదేవిధంగా కొల్లిపర మండలంలోని సిరిపురం, అత్తోట గ్రామాల్లో సాయంత్రం 6 నుంచి 6.30 గంటల వరకు పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల గుండా పోలీసు బలగాలు కవాతు చేస్తూ ప్రజలకు భద్రతపై నమ్మకం కల్పించాయి.

ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొనేలా పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల ప్రశాంతతకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫ్లాగ్ మార్చ్‌లలో తెనాలి రూరల్ సీఐ నాయబ్ రసూల్, తెనాలి ఒకటో పట్టణ సీఐ రాంబాబు, మూడో పట్టణ సీఐ శ్రీనివాసరావు, కొల్లిపర ఎస్ఐ ఎన్.సి. ప్రసాద్‌తో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, ఏఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రస్తుతం బుర్రిపాలెం, సిరిపురం, అత్తోట గ్రామాల్లో పరిస్థితి ప్రశాంతంగా ఉందని పోలీసులు వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా కొనసాగించడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నేటి నుంచి గుంటూరులో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ క్యాంపు కోర్టు

- ఈ నెల 23 నుంచి 27 వరకు కేసుల విచారణ, కొత్త ఫిర్యాదుల స్వీకరణ
- ఐదు జిల్లాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గుంటూరు, నవంబరు 22(జర్నలిస్ట్ ఫైల్) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఏపీఎస్‌హెచ్‌ఆర్‌సీ) ఆధ్వర్యంలో నవంబర్ 23 నుంచి 27వ తేదీ వరకు గుంటూరు కేంద్రంగా క్యాంపు కోర్టు నిర్వహించనున్నారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఐదు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన పెండింగ్ కేసుల విచారణతో పాటు కొత్త ఫిర్యాదులను స్వీకరించనున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ప్రక్రియా) నిబంధనావళి–2013లోని ఐదో నిబంధన ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న క్యాంపు కోర్టుల్లో భాగంగా గుంటూరులో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగే ఈ క్యాంపు కోర్టు నిర్వహణకు సంబంధించి కమిషన్ ఆదేశాల మేరకు నోడల్ అధికారి బొగ్గరం తారక నరసింహ కుమార్ వివరాలు వెల్లడించారు.

ఈ క్యాంపు కోర్టులో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం జిల్లాలకు సంబంధించిన మానవ హక్కుల ఉల్లంఘన కేసులను విచారించనున్నారు. ఇప్పటికే కమిషన్ వద్ద నమోదై పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు కొత్తగా వచ్చే ఫిర్యాదులను కూడా స్వీకరించనున్నారు. సంబంధిత బాధితులు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు.

అదేవిధంగా కమిషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి ఆయా జిల్లాల అధికారులు గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించే క్యాంపు కోర్టుకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. మానవ హక్కుల ఉల్లంఘనలకు గురైన బాధితులు, సంబంధిత ఫిర్యాదుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి కోరారు.

జోరుగా నామినేషన్లు

- మొత్తం 58 సర్పంచ్, 119 వార్డు నామినేషన్లు

బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): గ్రామ పంచాయతీ ఎన్నికలు – 2026 కు సంబంధించి బ్రహ్మంగారిమఠం మండలంలో రెండో రోజు కూడా నామినేషన్ల ప్రక్రియ జోరుగా కొనసాగింది.

మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెల్లడించిన ప్రొఫార్మా–2 నివేదిక ప్రకారం, రెండో రోజు 29 సర్పంచ్ నామినేషన్లు, 99 వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలయ్యాయి.

రెండు రోజులు కలిపి మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు మొత్తం 58 సర్పంచ్ నామినేషన్లు, 119 వార్డు నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు.

పంచాయతీల వారీగా మొత్తం నామినేషన్లు (రెండు రోజులు కలిపి):

- సోమిరెడ్డిపల్లె: 10 సర్పంచ్ 26 వార్డు
- రేకలకుంట: 4 సర్పంచ్, 10 వార్డు
- నాగిశెట్టిపల్లె: 2 సర్పంచ్, 4 వార్డు
- దిరసవంచ: 8 సర్పంచ్, 1 వార్డు
- డి. నేలటూరు: 6 సర్పంచ్, 10 వార్డు
- మల్లెపల్లె: 8 సర్పంచ్, 9 వార్డు
- తోట్లపల్లె: 2 సర్పంచ్, 5 వార్డు
- పలుగురాళ్లపల్లె: 6 సర్పంచ్, 11 వార్డు
- టి. చౌదవరిపల్లె: 3 సర్పంచ్, 24 వార్డు
- ముడమాల: 3 సర్పంచ్, 10 వార్డు
- గొడ్లవీడు: 6 సర్పంచ్, 9 వార్డు

రెండో రోజు దిరసవంచలో అత్యధికంగా 8 సర్పంచ్ నామినేషన్లు దాఖలు కాగా, టి. చౌదరివారిపల్లెలో అత్యధికంగా 18 వార్డు నామినేషన్లు దాఖలయ్యాయి. మూడో రోజు నామినేషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

ప్రజా సేవే పరమావధిగా పనిచేయాలి

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

❍ నూతన కౌన్సిలర్లకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దిశానిర్దేశం













తెనాలి, నవంబర్ 22(జర్నలిస్ట్ ఫైల్) : నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారాన్నే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సూచించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టణ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సోమవారం తెనాలి మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో నూతన చైర్మన్, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతన కౌన్సిలర్లను ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులుగా వారి బాధ్యతలు, మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో అనుసరించాల్సిన విధివిధానాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో వ్యవహరించాల్సిన తీరుపై దిశానిర్దేశం చేశారు.కౌన్సిలర్ పదవి కేవలం రాజకీయ హోదా మాత్రమే కాదని, ప్రజలు తమపై ఉంచిన విశ్వాసానికి ప్రతీక అని ఆలపాటి పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ప్రతి వార్డును అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. సమస్యలతో తమ వద్దకు వచ్చే ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి ఇబ్బందులను ఓపికగా విని పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు పూర్తి అవగాహనతో హాజరుకావాలని, చర్చించాల్సిన అంశాలను ముందుగానే అధ్యయనం చేయాలని సూచించారు. వార్డుల్లో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, రహదారులు, ప్రజారోగ్యం వంటి మౌలిక సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులపై స్పష్టమైన ప్రతిపాదనలు రూపొందించి వాటి అమలుకు కృషి చేయాలని చెప్పారు.

కౌన్సిల్ సమావేశాల్లో సభా మర్యాదలను పాటిస్తూ ఇతర సభ్యుల అభిప్రాయాలను గౌరవించాలని, వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమ అంశాలపై నిర్మాణాత్మక చర్చలు జరపాలని సూచించారు. మున్సిపల్ చట్టాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు, కౌన్సిల్ విధివిధానాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

ప్రతి కౌన్సిలర్ తమ వార్డుల్లో నిరంతరం పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావాలని, సమస్యలు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.రాజకీయాలకు అతీతంగా కులమత, వర్గ భేదాలు లేకుండా ప్రజలందరికీ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఆలపాటి కోరారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, క్రమశిక్షణతో పనిచేసి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ప్రజలు పదవులు ఇచ్చింది అధికారం చెలాయించడానికి కాదని, వారి సమస్యను పరిష్కరించి జీవితాల్లో మార్పు తీసుకురావడానికేనని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నిజమైన ప్రజాసేవకు నిదర్శనమని అన్నారు. నూతన కౌన్సిలర్లందరూ సమష్టి కృషితో తెనాలి పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మహమ్మద్ కుద్దూస్, వసంతం అశోకవర్ధన, మంగమూరి హరిబాబు, పెనుపాటి రవీంద్ర, మల్లవరపు విజయ్, గోనుగుంట్ల కన్నయ్య, మధు కోనేరు, కొండ రమాదేవి, పరుచూరి రమ్య, జొన్నకూటి సుధా మాధవి, నూతన కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రి అభివృద్ధికి ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ అవసరం



- 26న కూటమి అభ్యర్థులను గెలిపించండి - బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి
- 29వ వార్డు లో బిజెపి తెలుగుదేశం,జనసేన శ్రేణులు భారీ ర్యాలీ

రాజమహేంద్రవరం, నవంబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్) : రాజమండ్రి నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధన కోసం నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం ముగుస్తున్న నేపథ్యంలో ఆమె మీడియా పాయింట్స్‌లో మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి ప్రజలు అపూర్వమైన విజయాన్ని అందించారని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు.

గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణతో పాటు సంక్షేమానికి కూడా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో డబుల్ ఇంజిన్ సర్కార్‌కు తోడుగా స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపిస్తే ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌తో రాజమండ్రి అభివృద్ధికి మరింత వేగం చేకూరుతుందని అన్నారు.

స్వర్ణ రాజమండ్రి నిర్మాణానికి ప్రజలు ఈ ఎన్నికల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

2027లో గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సమస్యల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవి క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన కలిగిన నాయకురాలని, మహిళా సంఘాలతో సన్నిహితంగా పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు.

నగర మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు మహిళా సాధికారతకు కూడా ఆమె కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

29వ వార్డు కూటమి అభ్యర్థి బాలమురళీకృష్ణను కూడా ప్రజలు ఆశీంస్వదించాలని పురంధేశ్వరి కోరారు. ఆయన తండ్రి శంకరరావు కుటుంబం గతంలో ప్రజలకు , రామాలయ నిర్మాణంలో వారి పాత్రను గుర్తుచేశారు.

ఈ నెల 26న జరిగే ఎన్నికల్లో గులాబీ రంగు స్లిప్‌లో ఐదో నంబరులో ఉన్న మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవికి, రెండో స్లిప్‌లో మొదటి నంబరులో ఉన్న 29వ వార్డు అభ్యర్థి బాలమురళీకృష్ణకు కేటాయించిన గుర్తులైన కమలం, సైకిల్‌పై ఓటు వేసి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రాజమండ్రి అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ పురంధేశ్వరి తన ప్రసంగాన్ని ముగించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుంటే ఈ నెల 30న రాష్ట్రవ్యాప్త ఆందోళన



- జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతాం
- పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి: ఆర్ఎస్‌యూ

విజయవాడ, నవంబర్ 22(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) ప్రకటించింది. విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఆర్ఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించలేక చదువును కొనసాగించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో జాప్యం కారణంగా కొందరు విద్యార్థులు తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు.

పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకం కలగకుండా పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ నెల 30వ తేదీలోగా పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

ఈ సమావేశంలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి శాంతి, రాష్ట్ర కమిటీ సభ్యులు అవినాష్, నరేష్ నాయుడు, సూర్యనారాయణ, విజయవాడ నగర అధ్యక్షుడు సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు ఆర్ఎంపీ, పిఎంపీలే వైద్య సేవల్లో కీలకం

- వారికి ప్రభుత్వ గుర్తింపు కల్పించేందుకు కేంద్రంతో మాట్లాడతా
- బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు



రాజమహేంద్రవరం, నవంబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం వైద్య సేవలందిస్తున్న ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రజా వైద్యులుగా గుర్తింపు పొందారని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తున్న వీరికి ప్రభుత్వపరంగా తగిన గుర్తింపు కల్పించాల్సిన అవసరం ఉందని, ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని తెలిపారు.

ఆదివారం రాజమహేంద్రవరంలో ఆర్ఎంపీ, పీఎంపీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రభుత్వ వైద్య సదుపాయాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలు ఇప్పటికీ ఆర్ఎంపీలు, పీఎంపీల వద్దకు వెళుతున్నారంటే వారిపై ప్రజలకు ఉన్న విశ్వాసం అర్థమవుతోందన్నారు. 20, 30 ఏళ్లకు పైగా వైద్య సేవలు అందిస్తున్న వారి అనుభవాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

ఆర్ఎంపీలు, పీఎంపీలకు తగిన పరీక్షలు నిర్వహించి, మూడు నాలుగు నెలల శిక్షణ అందించి, ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం ద్వారా చట్టబద్ధమైన పరిధిలో గుర్తింపు కల్పించే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇప్పటికే ఈ సంఘాల ప్రతినిధులు జేపీ నడ్డాను కలిశారని, మరోసారి ఆయనతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆధునిక వైద్య పరీక్షల ప్రాధాన్యతను గుర్తించి, అవసరమైన సందర్భాల్లో రోగులను నిపుణులైన వైద్యుల వద్దకు పంపించాలని సూచించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా గ్రామీణ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తోందని, అక్కడ 105 రకాల మందులతో పాటు నర్సింగ్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

బీజేపీ దేశాభివృద్ధి లక్ష్యంగా ఏర్పడిన సంస్థ అని సోము వీర్రాజు పేర్కొన్నారు. 1980లో అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో కమలం గుర్తుతో పార్టీ ప్రస్థానం ప్రారంభమైందని గుర్తుచేశారు. దేశ రాజకీయాల్లో విలువలు, పారదర్శకతను నెలకొల్పడమే పార్టీ లక్ష్యమన్నారు.

రాజమహేంద్రవరం మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవి సాధారణ కుటుంబం నుంచి వచ్చి ప్రజాసేవలో ఎదిగారని తెలిపారు. వరల్డ్ విజన్ సంస్థ ద్వారా పిల్లలకు విద్యాబోధన, నైట్ స్కూల్ నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టారని, మహిళా సంఘాల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని వివరించారు. ప్రజల మధ్య ఉంటూ సేవలందించే వారిని బీజేపీ ప్రోత్సహిస్తుందని చెప్పారు.

ఆర్ఎంపీలు, పిఎంపీలు ప్రజల్లో తమకున్న ఆదరణను ప్రజాసేవకు వినియోగించాలని, రేలంగి శ్రీదేవితో పాటు కూటమి అభ్యర్థుల గురించి ప్రజలకు వివరించాలని సోము వీర్రాజు కోరారు.

బిజెపి ఎపి ఇంఛార్జి అరవింద్ సింగ్ భదోరియా మాట్లాడుతూ మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీ దేవి తో పాటు కూటమి కార్పోరేటర్లను గెలిపించాలని కోరారు

మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం చేయడం బిజెపి ధ్యేయం అన్నారు

క్షేత్రస్థాయిలో కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే సమగ్ర అభివృద్ధి

- 12వ వార్డులో చిక్కాల వీర వెంకటరమణకు మద్దతుగా మంత్రి కందుల దుర్గేష్ ప్రచారం



రాజమహేంద్రవరం, నవంబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్) : నగరంలో సమగ్ర అభివృద్ధి వేగవంతం కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా 12వ వార్డు కూటమి జనసేన అభ్యర్థి చిక్కాల వీర వెంకటరమణ (బాబులు)కు మద్దతుగా ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తనయుడు గోరంట్ల రవికిరణ్‌తో కలిసి పలు కాలనీల్లో పర్యటించి ఓటర్లను అభ్యర్థించారు.

ఆదర్శనగర్, బాలాజీపేట, రామకృష్ణ నగర్, జీవీ నగర్, ఈస్ట్ రైల్వే కాలనీ, రైతు నగర్, ఆవ రోడ్డు, వాంబే గృహాల కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రచార రథంపై పర్యటిస్తూ ప్రజలకు అభివాదం చేశారు. పలు కాలనీల్లో మహిళలు మంగళహారతులతో మంత్రికి స్వాగతం పలికారు. వందలాది మంది కూటమి కార్యకర్తలు నిర్వహించిన బైక్ ర్యాలీతో 12వ వార్డులో ఎన్నికల సందడి నెలకొంది.

కాలనీల సమస్యలకు శాశ్వత పరిష్కారం: ప్రచారంలో భాగంగా జీవీ నగర్ వాసులు తమ ప్రాంతంలోని డ్రైనేజీ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల అనంతరం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి రూ.కోటి మంజూరు చేసినట్లు వెల్లడించారు. వాంబే కాలనీలో మౌలిక వసతుల కల్పనతో పాటు వివిధ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా: ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ద్వారా వివిధ వర్గాలకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరాలన్నా, నగరంలో అభివృద్ధి పనులు వేగవంతం కావాలన్నా స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు పలకాలని కోరారు.

తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో వాంబే కాలనీ ఏర్పాటుకు కృషి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 151 అసెంబ్లీ స్థానాలు ఉన్నప్పటికీ ప్రజలకు ఆశించిన స్థాయిలో సేవలు అందించలేకపోయారని విమర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని సూచించారు.

12వ వార్డు అభ్యర్థి చిక్కాల వీర వెంకటరమణ ప్రజలతో సన్నిహితంగా ఉంటూ, నిరంతరం అందుబాటులో ఉండే నాయకుడని మంత్రి పేర్కొన్నారు. ఆయనకు తనతో పాటు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. గతంలో గ్రామీణ ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతం నగరపాలక సంస్థ పరిధిలోకి రావడంతో మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. త్వరలో కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో పాటు టిడ్కో గృహాల నిర్మాణాన్ని కూడా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

అభివృద్ధికి ఓటు వేయండి: నవంబర్ 26న జరిగే నగరపాలక సంస్థ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవిని కమలం గుర్తుపై, 12వ వార్డు జనసేన అభ్యర్థి చిక్కాల వీర వెంకటరమణను గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. నగర అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 12వ వార్డు అభ్యర్థి చిక్కాల వీర వెంకటరమణ మాట్లాడుతూ తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, 12వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com